RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 172 శుక్రవారం 18 జూలై 2025 పేజీలు : 4

## వర్షాలకు ఢిల్లీ అతలాకుతలం

న్యూఢిల్లీ : కుండపోత వర్షాలతో దేశ రాజధాని నగరం ఢిల్లీ అతలాకుతలమైంది. అర్ధరాత్రి దాటాక మొదలై.. ఉదయం వరకు తెరిపినివ్వకుండా కురిసిన వానతో లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి. రోడ్లు చెరువులను తలపించగా.. వాహనాలు నీట మునిగాయి. ఉరుములతో కూడిన వర్షానికి తోడు.. గంటకు 8 2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. దీంతో.. ఢిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో 200 విమానాలపై తీవ్ర ప్రభావం కనిపించింది. 49 విమానాలు రీ-షెడ్యూల్ అవ్వగా.. మరికొన్ని ఆలస్యంగా నడిచాయి. విమానాశ్రయం టెర్మినల్-1 వద్ద పైకప్పు దెబ్బతిని, వర్షపునీరు లీకవుతోంది. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఎన్‌సీఆర్-ఢిల్లీ వ్యాప్తంగా భారీ వర్షాల ప్రభావం కనిపించింది. చాలా చోట్ల విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయమేర్పడింది. పలు కాలనీల్లో తాగునీటి సరఫరా నిలిచిపోయింది.




# కసరత్తు షురూ!

## ముందుగా పరిషత్ పోరు నిర్వహిస్తారనే సంకేతాలు!!

### రిజర్వేషన్లు, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు కలిసి వస్తాయని భావిస్తున్న కాంగ్రెస్

### గతంలో చేసిన పనులు, ప్రభుత్వ వ్యతిరేకతపై బీఆర్ఎస్ ఆశలు

### ఈసారి స్థానిక సంస్థల ఎన్నికలపై బీజేపీ ప్రత్యేక దృష్టి

హైదరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కేబినెట్ తీర్మానం చేయడంతో అందరి దృష్టి స్థానిక సంస్థలపై పడింది. పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసి సంవత్సరన్నరపైగా అవుతుండటం, పరిషత్‌ల గడువు ముగిసి సంవత్సరం పూర్తవుతుండటంతో ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనే సందేహాలు అందరిలో నెలకొన్నాయి.

ప్రస్తుతం స్థానిక సంస్థలు ప్రత్యేక అధికారుల పాలనలో ఉండి, నిధులు రాక అభివృద్ధి కుంటుపడింది. అయితే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చింది. అందులో భాగంగానే రిజర్వేషన్లు 50 శాతానికి లోబడి ఉండాలనే కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు ఆలస్యమవుతూ వచ్చింది. అయితే తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఇస్తుండటంతో ఇప్పుడు అదే పద్ధతిని రాష్ట్ర ప్రభుత్వం అవలంభించాలని భావిస్తోంది. ప్రస్తుతం అందుకు సంబంధించిన విధివిధానాలు ఖరారవుతున్నట్లు తెలుస్తుండగా, రేపో.. మాపో ఆర్డినెన్స్ వచ్చే అవకాశం ఉంది. హైకోర్టు ఇప్పటికే ఎన్నికలను పూర్తి చేయడానికి మూడు నెలల గడువు ఇవ్వగా.. ఆలోపే పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. ప్రస్తుతానికి పంచాయతీలకంటే ముందు పరిషత్ ఎన్నికలే నిర్వహిస్తారనే సంకేతాలు వెలువడుతున్నాయి. మరి రాష్ట్ర ప్రభుత్వం ఏ విధంగా నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

ఇప్పటికే ఓటర్ జాబితా సిద్ధం కాగా.. కావాల్సిన బ్యాలెట్ బాక్సులు, సామగ్రి, ప్రింటింగ్ కూడా అధికారులు పూర్తిచేసి ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నారు.

**త్రిముఖ పోరు..** గడిచిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అప్పుడు బీఆర్ఎస్ అధికారంలో ఉండగా.. మెజారిటీ స్థానాలను ఆ పార్టీనే దక్కించుకుంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఆ పార్టీకి సింహభాగం స్థానాలు దక్కాయి. వేరే పార్టీల్లో గెలిచిన వారు సైతం అప్పట్లో బీఆర్ఎస్‌లో చేరారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కొంతమంది బీఆర్ఎసను వీడి కాంగ్రెసలో చేరినప్పటికీ, ఇంకా బీఆర్ఎసలో తాజా మాజీ ప్రజాప్రతినిధుల శాతం అధికంగానే ఉంది. గ్రామాల్లో ఇంకా ఆ పార్టీ కేడర్ బలంగా ఉండగా, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచిన ఊపుతో ఉన్న కాంగ్రెస్ పార్టీ కేడర్‌ను బలోపేతం చేసుకోవడం వంటి పరిణామాలతో పోటీ హోరాహోరీగా ఉండనుంది. బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చామనే అంశంతో కాంగ్రెస్ ముందుకు వెళ్లనుంది. గ్రామాలు, పట్టణాల్లో ఇటీవలి కాలంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలను ఎక్కువ సంఖ్యలో నిర్మించడం, సన్న బియ్యం పథకం వంటి అంశాలు తమకు కలిసి వస్తాయని ఆ పార్టీ భావిస్తోంది. అలాగే బీఆర్ఎస్ తమకున్న కేడర్, గతంలో చేసిన పనులు, ప్రభుత్వ వ్యతిరేకత కలిసి వస్తుందని అభిప్రాయపడుతోంది. ఇప్పటికే ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు తరచూ పార్టీ సమావేశాలు నిర్వహిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. బీసీ రిజర్వేషన్లు అమలయ్యే పక్షంలో తమ వ్యూహాలను మార్చుకునే అవకాశం ఉంది. ఇక గతంలో ఎన్నడూ లేనంతగా బీజేపీ కూడా స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి పెట్టింది. ప్రత్యామ్నాయ పార్టీగా ఎదగడానికి స్థానిక సంస్థల ఎన్నికలు గేట్‌వేగా ఉంటాయని ఆ పార్టీ నాయకత్వం అనుకుంటోంది. పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన ఓటు బ్యాంకును సద్వినియోగం చేసుకుని.. సరైన అభ్యర్థులను నిలిపితే ఫలితం ఉంటుందని నాయకులు అభిప్రాయపడుతున్నారు. అయితే పంచాయతీలను పార్టీ గుర్తుపై కాకుండా ఇతర గుర్తులపై గెలుచుకోవాల్సి ఉంటుంది.

పరిషత్ ఎన్నికల్లో మాత్రం పార్టీ గుర్తులు ఉంటాయి. కాబట్టి కాంగ్రెస్ పార్టీ ముందుగా పరిషత్ ఎన్నికలను నిర్వహించి, ప్రభుత్వ పనితీరుకు గెలుపు అని చెప్పాలని భావిస్తోంది.

**గతంలో బీసీల గెలుపు శాతమిది..** ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని భావిస్తుండగా.. గతంలో రిజర్వేషన్లు తక్కువగా ఉన్న సమయంలోనూ బీసీలు జనరల్ స్థానాల్లో ఎక్కువ సీట్లు గెలుచుకున్నారు. ఒకవేళ బీసీలకు చట్టబద్ధంగా రిజర్వేషన్లు ఇవ్వలేని పక్షంలో పార్టీపరంగా 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కాంగ్రెస్ గతంలో భావించింది. దానిపై కొంత విమర్శలు రావడంతో ఎలాగైనా చట్టబద్ధత కల్పించాలని భావిస్తోంది.

ఈ విషయమై ఇప్పటికే కేబినెట్ తీర్మానం చేసింది. దాంతో ఆశావహులు పల్లెల్లో ముమ్మరంగా తిరుగుతున్నారు.

# తెలంగాణలోని మహిళలకు భారీ శుభవార్త..

## 65 లక్షల మందికి "దసరా" కానుక





హైదరాబాద్ : తెలంగాణలోని మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం మరో శుభవార్త తెలిపింది. తెలంగాణలోని 65 లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు దసరా పండగ కానుకగా చీరలను పంపిణీ చేయనుంది. ఒక్కొక్కరికి రెండు చొప్పున చీరలు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు చీరల తయారీ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 318 కోట్లను ఇప్పటికే విడుదల చేసింది. తెలంగాణలోని మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రంలోని 65 లక్షల మంది మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు చీరలు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఒక్కొక్కరికి రెండు చీరల చొప్పున పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ చీరల తయారీ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 318 కోట్లను ఇప్పటికే విడుదల చేసింది. ప్రస్తుతం 1.25 కోట్ల మీటర్లతో 20 లక్షల చీరల తయారీ పూర్తయినట్లు సమాచారం. మరో 45 లక్షల చీరల ఉత్పత్తి కొనసాగుతోంది. ఈ మేరకు సిరిసిల్లలో ప్రతి రోజూ 5 వేల మంది కార్మికులు చీరల తయారీ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

దసరా నాటికి మొత్తం చీరల తయారీని పూర్తి చేసి మహిళలకు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం అవుతోంది. మహిళా స్వయం సహాయక సభ్యులకు ఇప్పటికే రేవంత్ ప్రభుత్వం రెండు గుడ్ న్యూస్ లు చెప్పింది. త్వరలోనే వడ్డీ లేని రుణాలను అందిస్తామని పేర్కొంది. అంతేకాక ప్రమాద బీమా పథకం పైన తాజాగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల ప్రమాద బీమా పథకాన్ని 2029 వరకు పొడిగించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు స్త్రీ నిధి ద్వారా బీమా అమలును కొనసాగించాలని నిర్ణయించిన కాంగ్రెస్ ప్రభుత్వం జీవో కూడా జారీ చేసింది. అంతేకాక తాజాగా మరొక నిర్ణయం తీసుకుంది రాష్ట్ర ప్రభుత్వం.

కొత్త స్టాంపు డ్యూటీ చట్టాన్ని రూపొందించేందుకు కసరత్తు చేస్తోంది. ఈ కొత్త సవరణ బిల్లును వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టనుంది. అయితే కొత్త సవరణ బిల్లులో మహిళా సాధికారతను ప్రోత్సహించే దిశగా వారికి స్టాంప్ డ్యూటీ తగ్గించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందని మంత్రి పొంగులేటి వెల్లడించారు.



## మహారాష్ట్రలో విలీనం కానున్న తెలంగాణలోని 14 గ్రామాలు.. స్పష్టం చేసిన మంత్రి

హైదరాబాద్ : మహారాష్ట్ర బార్డర్‌లో ఉన్న తెలంగాణలోని 14 గ్రామాలను త్వరలోనే మహారాష్ట్రంలో విలీనం చేయనున్నారు. ఈ మేరకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు మహారాష్ట్ర మంత్రి చంద్రశేఖర్ బవాంకులే అధికారిక ప్రకటన చేశారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాజూరా, జీవతి తాలూకా లో ఉన్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన 14 గ్రామాలను మహారాష్ట్రలో విలీనం చేస్తామని ప్రకటించారు. 14 గ్రామాల ప్రజలు, అధికారులు, అన్ని పార్టీల నేతల డిమాండ్ మేరకు తాము ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. అలాగే విలీనం చేయనున్న 14 గ్రామాలకు చెందిన రికార్డులూ. జమాబందీ అన్ని మహారాష్ట్రలోనే ఉన్నాయని, తెలంగాణ వద్ద ఎటువంటి రికార్డులు లేవని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. తన ఆదేశాలతో విలీన ప్రక్రియ ప్రారంభం అయిందని తెలంగాణలో ఉన్న 14 గ్రామాలను చంద్రపూర్ జిల్లాలో అధికారికంగా కలపనున్నట్లు మంత్రి చంద్రశేఖర్ బవాంకులో స్పష్టం చేశారు.




## నేడు రైతుల ఖాతాల్లోకి పీఎం కిసాన్ నిధులు..!

న్యూఢిల్లీ, జూలై 16: పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన 20వ విడత నిధులను ప్రధాని మోదీ శుక్రవారం బిహార్‌లో జరగనున్న భారీ బహిరంగ సభలో విడుదల చేసే అవకాశముందని ఓ జాతీయ వార్తా సంస్థ నివేదిక పేర్కొంది. పీఎం కిసాన్ నిధులను ప్రతి నాలుగు నెలలకోసారి విడుదల చేస్తారు. చివర 19వ విడత నిధులను 2025 ఫిబ్రవరిలో విడుదల చేశారు. గతేడాది జూన్ వాయిదాను నెల ముగియక ముందే విడుదల చేశారు. అయితే ఈ సారి నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది. పీఎం కిసాన్ ద్వారా దేశవ్యాప్తంగా 9.8 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరుతోంది.

# బీఆర్ఎస్ రాంగ్...కాంగ్రెస్ కరెక్ట్...కవిత రూటు ఎటు ?

హైదరాబాద్ : బీఆర్ఎస్ నుంచి మెల్లగా కవిత దూరం అయిపోతున్నారు. కల్వకుంట్ల కవిత కాస్తా జాగృతి కవితగా పరిణామ క్రమం చెందారు. ఆమెది సొంత జెండా సొంత అజెండాగా మారింది. బీఆర్ఎస్ లో అన్న కేటీఆర్ తండ్రి కేసీఆర్ ఉండగానే తనకు సరైన రాజకీయ న్యాయం జరగదని ఆలోచించారో ఏమో లేక ఈ ఎమ్మెల్సీ పదవే తనకు చివరి అధికార మజిలీ అక్కడ అని ఊహించారో తెలియదు కానీ కవిత మాత్రం సొంతంగానే అడుగులు వేస్తున్నారు. అయితే ఆమె బీసీలకు మద్దతుగా 42 శాతం రిజర్వేషన్లు వారికి దక్కాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎన్నికల్లో ఆ రిజర్వేషన్ కోటాతోనే ముందుకు వెళ్ళాలని కూడా కోరారు. దాంతో ఆమె బీసీలను దగ్గర చేసుకుని పార్టీ పెడతారు అన్న ప్రచారం నిన్నా మొన్నా దాకా సాగింది. ఇదిలా ఉంటే తాజాగా కవిత మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ తనకు మరింత దూరం పెరిగిందని సంకేతాలు ఇచ్చేశారు. తన మీద తీన్మార్ మల్లన్న చేసిన అనుచిత వ్యాఖ్యలను బీఆర్ఎస్ ఖండించలేదని కూడా ఆమె ఎత్తి చూపారు. ఇక బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకుని రావడాన్ని ఆమె సమర్థించారు. ఇది కరెక్ట్ నిర్ణయమే అని అన్నారు. ప్రస్తుతం ఈ ఆర్డినెన్స్ గవర్నర్ పరిశీలనలో ఉంది. తన మాదిరిగా ఆలోచించడానికి బీఆర్ఎస్ నేతలకు మరో నాలుగైదు రోజులు సమయం పట్టవచ్చు అని ఆమె అంటున్నారు. ఈ విషయంలో బీఆర్ఎస్ నేతలు అభ్యంతరాలు వ్యక్తం చేయడం తప్పేనని ఆమె అంటున్నారు. బీసీలకు



న్యాయం చేసే విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కరెక్ట్ గానే వ్యవహరించింది అని ఆమె అన్నారు. బీసీలకు న్యాయం చేయాలంటే చట్ట సవరణ చేసి ఆర్డినెన్స్ తీసుకుని రావడం కంటే ఇపుడు మేలైన మార్గం ఏమిటి అని ఆమె అంటున్నారు. ఆ విధంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసింది రైట్ అనేశారు. తాను ఈ విషయంలో న్యాయ నిపుణులతో చర్చించిన మీదటనే ఈ ఆర్డినెన్స్ కి మద్దతు ప్రకటించాను అని ఆమె అన్నారు. బీఆర్ఎస్ నాయకులు తన దారికి రావాల్సిందే అని ఆమె అంటున్నారు. ఇదిలా ఉంటే కాంగ్రెస్ అంటే ఒంటి కాలి మీద లేచే బీఆర్ఎస్ లో అందునా కేసీఆర్ కుమార్తెగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న ఒక నిర్ణయం బాగుందని బాహాటంగా సమర్థించడం అంటే కవిత ఆలోచనలు వ్యూహాలు ఏమిటి అన్న చర్చ సాగుతోంది. బీఆర్ఎస్ దే తప్పు అని ఆమె చెప్పడమూ ఆలోచించాల్సిందే అంటున్నారు. ఇదిలా ఉంటే లిక్కర్ స్కాం లో గత ఏడాది తీహార్ జైలుకు వెళ్ళి వచ్చిన కవిత నాటి నుంచే పార్టీ తీరు మీద అసహనంగా ఉంటున్నారు అని అంటున్నారు. తనకు పార్టీలో మద్దతు దక్కడం లేదని ఆమె ఆవేదన చెందుతున్నారు అని అంటున్నారు దాంతో ఆమె తన దారి తాను చూసుకుంటున్నట్లుగానే కనిపిస్తోంది. ఆమె తాజాగా కాంగ్రెస్ ని పొగడం తో ఆమె ఆ పార్టీ పట్ల సాఫ్ట్ కార్నర్ తో ఉన్నారా అన్నది చర్చగా ఉంది. కాంగ్రెస్ మహా సముద్రం. జాతీయ పార్టీ. అక్కడ అవకాశాలు బాగానే ఉంటాయి. పైగా కవిత కేసీఆర్ కుమార్తె కావడంతో ఆమె వస్తే కనుక ప్రయారిటీ బాగానే ఉంటుంది అని అంటున్నారు. అయితే సొంతంగా పార్టీ పెట్టి ముందు తన బలాన్ని నిరూపించుకున్న తరువాత అపుడు కాంగ్రెస్ లో చేరేందుకు చూస్తే రాజకీయ లాభం బాగా ఉంటుందని కవిత ఆలోచిస్తున్నారా అన్నది మరో చర్చగా ఉంది ఏది ఏమైనా కవిత మా ఇంటి ఆడపడుచు అయినా రాజకీయంగా ఆమె కాదని కల్వకుంట్ల ఫ్యామిలీ డిసైడ్ అయిన రోజునే కవిత అసలు రాజకీయం మొదలవుతుందని అంటున్నారు. జరుగుతున్న పరిణామాలు చూస్తే ఆ రోజు ఎంతో దూరంలో లేదని అంటున్నారు.


# సంపాదకీయం

## బీజేపీకి భయపడి హిందీని ప్రమోట్ చేస్తున్నారా?

దక్షిణాదిన హిందీ భాష మీద వివాదం సాగుతోంది. తమిళనాడు అయితే దశాబ్దాల క్రితమే హిందీ వద్దు అని అతి పెద్ద ఉద్యమం నిర్వ హించింది. హిందీ గురించి ఎంతో గొప్పగా చెప్పే బీజేపీ నాయకులు సైతం తమిళనాడుకు వస్తే ఇంగ్లీష్ లోనే మాట్లాడుతారు. అలా హిందీ విషయంలో తమిళులను ఒప్పించలేక పోయిన విషయం కళ్ళ ముందు ఉంది. మరో వైపు చూస్తే హిందీ భాష మీద ఎవరికి ఏ రకమైన అభిప్రాయం ఉన్నా హిందీ పేరు చెప్పి ఆధిపత్య రాజకీయాలకు తెర తీస్తున్నారు అన్నది అయితే దక్షిణాది రాష్ట్రాల్లో ప్రబలంగా ఉంది. పైగా హిందీ కంటే ద్రవిడ భాషలు ప్రాచీనమైనవి అని అందువల్ల కేవలం హిందీని మాత్రమే జాతీయ భాషగా చెప్పడం ఏ మేరకు సమంజసం అని కూడా విమర్శలు ఉన్నాయి. వీటి సంగతి ఇలా ఉంటే ఏపీలో మాత్రం అన్ని పార్టీల నాయకులు తరత భేదం లేకుండా హిందీని జాతీయ భాషగా ప్రమోట్ చేస్తున్నారు. మొన్న పవన్ కళ్యాణ్ హిందీని రాజభాష అంటే నిన్న నారా లోకేష్ హిందీని జాతీయ భాష అన్నారు. ఇపుడు జగన్ సైతం అదే అంటున్నారు. హిందీ జాతీయ భాషే ఇందులో వేరేగా చర్చించడానికి ఏముంది అని ఆయన అంటున్నారు. ఆయనను మీడియా హిందీ భాష వివాదం గురించి ప్రశ్నించినపుడు జగన్ స్పందిస్తూ ఈ రకమైన వ్యాఖ్యలు చేసారు. హిందీ భాష జాతీయ భాషే అని ఆయన అంటూ స్పష్టత కూడా ఇచ్చేశారు. దేశంలో ఏ రాష్ట్రం వారు అయినా తొలి లాంగ్వేజ్ తమ మాతృ భాషను ఎంచుకోవచ్చు, రెండవ భాషగా హిందీని కచ్చితంగా పెట్టాలని మూడవ భాషగా ఇంగ్లీష్ ఉండాలని జగన్ ప్రతిపాదిస్తున్నారు. ఎందుకంటే ఇంగ్లీష్ గ్లోబల్ లాంగ్వేజ్ అని ఆయన అంటున్నారు. ఇంగ్లీష్ నేర్చుకోకపోతే అన్ని విధాలుగా వెనకబడతామని అవకాశాలు కూడా పూర్తిగా తగ్గిపోతాయని ఆయన చెప్పుకొచ్చారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలలోని విద్యార్థులు ఇంగ్లీష్ ని సరిగ్గా నేర్చుకోకపోయినా స్పష్టంగా పలకకపోయినా మాట్లాడకపోయినా ప్రపంచంతో పోటీ పడలేరని జగన్ అన్నారు. ఇక ఇంగ్లీష్ మీడియంలో బోధన ఉన్నా లాంగ్వేజ్ వన్ లాంగ్వేజ్ టూ గా తమకు నచ్చిన భాషను నేర్చుకోవచ్చు అని జగన్ అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉంటే పనిగట్టుకుని మరీ ఏపీ నాయకులు హిందీని ప్రమోట్ చేయడం పట్ల రాజకీయంగా చర్చ సాగుతోంది. బీజేపీకి ఎక్కడ కోపం వస్తుందో అన్న ఆలోచనతోనే ఎవరికి వారు హిందీ జాతీయ భాష అంటున్నారు. నిజానికి హిందీ జాతీయ భాష కాకపోయినప్పటికీ దానిని ప్రమోట్ చేయడం కోసం పోటీలు పడుతున్నారు. ఈ విషయంలో టీడీపీ జనసేన సరసన వైసీపీ కూడా చేరింది అని అంటున్నారు. నిజానికి భాషకు రాజకీయాలతో సంబంధం లేదు. కానీ మిక్స్ చేయాలని కొందరు చూస్తున్నారు అని భాషావేత్తలు అంటున్నారు. భాషతో రాజకీయాలు చేయడం మానుకోవాలని ఒక వైపు మేధావులు అంటూంటే మరో వైపు అదే విధంగా మాట్లాడుతున్నారు. ఈ విషయంలో మీడియా సైతం గుచ్చి గుచ్చి అవే ప్రశ్నలు వేస్తోంది. మరి దానికి సరైన జవాబులు చెప్పవచ్చు. కానీ ఎవరూ హిందీని కాదు అనలేకపోతున్నారు. ఆ విధంగా చూస్తే దేశంలో ఎక్కడా లేని హిందీ అభిమానం ఏపీలో బాగా కనిపిస్తోంది అని అంటున్నారు. ఇది నిజంగా బీజేపీ సాధించిన విజయమా లేక బీజేపీ అభిమానం ప్రాపకం కోసం ఏపీ రాజకీయ నేతలు అంతా కలసి చేస్తున్న భాషా విన్యాసమా అన్న చర్చ అయితే సాగుతోంది. మొత్తానికి చూస్తే హిందీకి జై హింద్ అంటున్న ఏపీ పార్టీలను నాయకులను దక్షిణాది రాష్ట్రాల నాయలుకు పార్టీలు ఏ విధంగా చూస్తాయో ఏ విధంగా ఈ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటాయో తెలియదు కానీ బీజేపీ పెద్దలు మాత్రం ఫుల్ హ్యాపీస్ అవుతారేమో.

## కోటి మంది మహిళలు కోటీశ్వరులు కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యం : మహేందర్ రెడ్డి

### ఇందిరా మహిళా శక్తి సంబరాలలో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్ రెడ్డి.




శామీర్ పేట, (గరుడ వార్త) : కోటి మంది మహిళలను కోటీశ్వరాళ్లుగా చేయాలన్నదే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. గురువారం శామీర్ పేట మండలం అలియాబాద్ చౌరస్తా లోని శుభం గార్డెన్ లో జరిగిన కార్యక్రమంలో మహేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ఇందిరా మహిళా శక్తి పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి తో కలిసి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేసే దిశగా శిక్షణ, ఉపాధి, స్వావలంబన దిశగా మహిళలు అడుగులు వేసేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. మహిళా సాధికారత కోసం గతంలో ఎప్పుడు లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహిళలను అని రంగాలలో, ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా కృషి చేస్తుందన్నారు. వ్యవసాయ రంగంలో గేదెలు, కోళ్ల, చేపల పెంపకం, డైరీల నిర్వహణ తోపాటు, పారిశ్రామిక రంగాలలో ఉన్న వారిని ముందడుగు వేసేలా ఆర్టీసీ బస్సుల కొనుగోలు, పెట్రోల్ పంపుల నిర్వహణ వంటి వాటిల్లో మహిళలకు అవసరమైన చేయూత నిస్తున్నామని చెప్పారు. అలాగే రైతుల కోసం రైతు భరోసా వేశాం. రుణమాఫీ, ఎరువుల పంపిణీ తదితరులు చేసి వ్యవసాయం దండుగ కాకుండా పండుగలా చేస్తున్నామన్నారు. మేడ్చల్ జిల్లాలోనూ 5 మండల సమాఖ్యలు ,118 గ్రామ సమాఖ్యల లో ఉన్న 3495 ఎస్ హెచ్ జి ల్లో 39 వేల 642 మంది లబ్ధిదారులకు బ్యాంకు లింకేజీ అవసరమైన ఆర్థిక సహకారంగా వడ్డీ లేని రుణాల అందిస్తున్నామని తెలిపారు. ఇలా 2024 -25 లో 2,794 సంఘాలకు 220 కోట్ల 68 లక్షలు విడుదల చేశామని, అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జూలై నాటికి 619 సంఘాలకు 39 కోట్ల రుణాలను అందించినట్లు చెప్పారు. వడ్డీ లేని రుణాల వడ్డీ రాయితీగా 2023 - 25 వరకు 2,911 సంఘాలకు రూ. 8 కోట్ల 75 లక్షల వడ్డీ డబ్బులను వారి ఖాతాలో జమ చేశామని తెలిపారు. స్త్రీ నిధి రుణాలుగా 2024- 25 లో రూ.16 కోట్ల 51 లక్షల రుణాలు ఇచ్చామని చెప్పారు. చిన్న వ్యాపారులకు 1698 యూనిట్లకు గాను రూ. 35 కోట్ల రుణాలు అందించామని, అమ్మ ఆదర్శ పాఠశాలలకు గాను 697 పనులకు రూ .8 కోట్ల 14 లక్షలు మహిళా సంఘాల ఆధ్వర్యంలో అందించినట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే డ్రెస్సులను గతంలో మాదిరిగా కాకుండా మహిళ సంఘాల ఆధ్వర్యంలో 2 జతలు కుట్టించే ఏర్పాట్లలో మేడ్చల్ జిల్లాలో 89 వేల విద్యార్థుల కు రూ. 14 కోట్లతో దుస్తులు కుట్టించామని తెలిపారు. అంతేకాకుండా సంక్షేమంలో భాగంగా మేడ్చల్ జిల్లాలో దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు తదితరులకు చెందిన లక్ష 43 వేల 736 మందికి చేయూత పింఛన్లను ప్రతినెల అందిస్తున్నామని చెప్పారు. కాగా ఇందిరా మహిళా శక్తి పథకం కింద లబ్ధిదారులకు చెందిన 619 ఎస్ హెచ్ జి సంఘాలకు రూ. 38 కోట్ల 86 లక్షలు, 3698 గ్రామ సంఘాలకు కోటీ 79 లక్షలు,5 మంది మహిళలకు లోన్ భీమా కింద 3 లక్షల 19 వేల చెక్కులను మహేందర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ రాధిక గుప్త, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఆర్టీఏ సభ్యుడు జైపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్, గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి వజ్రేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మందుల కొరత కార్మికుల వ్యథ!



గోదావరిఖని : రక్తపోటుతో బాధపడుతున్న ఓ సింగరేణి విశ్రాంత కార్మికుడికి కొన్ని రోజుల క్రితం నెలనెలా మందులు ఇచ్చేవారు. ప్రస్తుతం వారానికి మాత్రమే అందిస్తున్నారు. మళ్లీ వారానికి వచ్చి తీసుకెళ్లమని చెపుతున్నారు. నెలకోసారి ఆస్పత్రికి వచ్చే విశ్రాంత ఉద్యోగి ప్రస్తుతం వారానికి ఒకసారి వెళ్తుండటంతో ఇబ్బందులు పడుతున్నాడు. మధుమేహంతో బాధపడుతున్న మరో విశ్రాంత కార్మికుడికి సైతం ఈ సమస్యనే ఎదురవుతోంది.సింగరేణి ఉద్యోగులు, విశ్రాంత కార్మికులకు యాజమాన్యం సంస్థ ఆస్పత్రుల ద్వారా దీర్ఘకాలిక జబ్బులకు నెలనెలా ఉచితంగా మందులు పంపిణీ చేస్తోంది. ఇటీవల మాత్రం వారానికి సరపడా అందిస్తోంది. ఆస్పత్రుల్లో మందుల కొరత కారణంగా పూర్తిస్థాయిలో పంపిణీ చేయలేకపోతోంది. విశ్రాంత కార్మికులు చాలామంది రక్తపోటు, మధుమేహం, కీళ్ల నొప్పులు, శ్వాస, నరాల సంబంధ సమస్యలతో బాధపడుతున్నారు. వీరికి సింగరేణి ఆస్పత్రుల ద్వారా మందులు అందిస్తోంది. వైద్యం పొందే సౌకర్యం కూడా ఉంది. మందుల కోసమే ఏటా రూ.40 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్లు చెపుతున్న యాజమాన్యం క్షేత్రస్థాయిలో మాత్రం అలా కనిపించటం లేదు.

**దూర ప్రాంతాల్లో నివాసం.. వారానికోసారి ప్రయాణం**

గనులు విస్తరించి ఉన్న ఆరు జిల్లాల పరిధిలో పనిచేసిన విశ్రాంత కార్మికులు ఆ తర్వాత ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. హైదరాబాద్‌తో పాటు వరంగల్, కరీంనగర్ తదితర జిల్లాల్లో నివసిస్తున్నారు. అక్కడి నుంచి వారు పనిచేసిన ప్రాంతానికి చెందిన ఆస్పత్రికి వచ్చి మందులు తీసుకెళ్తుంటారు. నెలకోసారి వచ్చి మందులు తీసుకెళ్లే విశ్రాంత కార్మికులు ప్రస్తుతం వారానికి ఒకసారి రావడం వల్ల ప్రయాణ ఖర్చులతో పాటు అలసటకు గురవుతున్నారు. సింగరేణి వ్యాప్తంగా నాలుగు ప్రధాన ఆస్పత్రులతో పాటు 21 డిస్పెన్సరీలున్నాయి. వీటిల్లోనే విశ్రాంత కార్మికులు వారు పనిచేసిన ప్రాంతంలోని వైద్యశాలల్లో మందులు తీసుకోవాలి. కొత్తగూడెం, భూపాలపల్లి, గోదావరిఖని, రామకృష్ణాపూర్‌లలో ప్రధాన ఆస్పత్రులున్నాయి. మిగతావి డివిజన్‌కు ఒక డిస్పెన్సరీ నిర్వహిస్తున్నారు.

**వెంటనే కొనుగోలు చేయాలి**

విశ్రాంత కార్మికులకు నెల రోజులకు సరిపడా మందులు పంపిణీ చేయాలి. కొరత లేకుండా మందులు వెంటనే కొనుగోలు చేయాలి. దూర ప్రాంతాల నుంచి వచ్చే విశ్రాంత కార్మికులకు వారానికి సరిపడా మందులు ఇవ్వడం వల్ల ప్రయాణ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
వై.సత్తయ్య, బీఎంఎస్ నాయకులు

## పని చేయని ట్రాఫిక్ సిగ్నళ్లు

కోరుట్ల : జిల్లాలోని రెండో అతిపెద్ద పట్టణం కోరుట్లలో జాతీయ రహదారిపై రాకపోకలకు వాహనదారులు నిత్యం అవస్థలు పడుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. పట్టణంలోని ప్రధాన రహదారిపై నెలకొన్న రద్దీని నియంత్రించేందుకు నాలుగేళ్ల కిందట నందిచౌక్, కల్లూర్‌రోడ్ క్రాసింగ్ వద్ద పురపాలక సంఘం అధికారులు రూ.లక్షలు వెచ్చించి ట్రాఫిక్ సిగ్నళ్లు ఏర్పాటు చేశారు. విద్యుత్తు సరఫరా నిలిచిపోయినా పని చేసే విధంగా వాటిపై సోలార్ పరికరాలు అమర్చారు. పట్టణంలో విద్యుత్తు సరఫరా ఉంటేనే సిగ్నళు పని చేస్తుండేవి. గతేడాది వేసవిలో ట్రాఫిక్ సిగ్నళ్లు చెడిపోగా ఏడాది గడిచినా మరమ్మతు చేయకుండా బల్దియా అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు.పట్టణంలోని ప్రధాన రోడ్డు జాతీయ రహదారి ఒక్కటే కావడంతో నిత్యం వేల సంఖ్యలో భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పట్టణంలో రహదారిపై డివైడర్లు ఉండటంతో కూడళ్ల వద్ద మాత్రమే ప్రజలు రోడ్లు దాటే వీలుంది. పట్టణంలోని ప్రధాన కూడళ్లు నందిచౌక్, కల్లూర్ రోడ్ క్రాసింగ్ వద్ద రోజంతా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. భారీగా వాహనాలు ఒక్కసారిగా రహదారిపైకి వచ్చి అడ్డదిడ్డంగా వెళ్లడంతో వాహనాలు, ప్రజలు రోడ్లు దాటడం కష్టంగా మారింది.



వీటితోపాటు కొత్తబస్టాండ్ సర్కిల్, కార్గిల్‌చౌక్, అయిలాపూర్‌రోడ్ క్రాసింగ్ వద్ద వాహనాలు రోడ్లు క్రాస్ చేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రధాన సర్కిళ్ల వద్ద వాహనాల రద్దీని నియంత్రించేందుకు పోలీస్ స్టాండ్‌లను ఏర్పాటు చేసినా అందులో సిబ్బందిని నియమించడం లేదు. దీంతో తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇక్కట్లు ఏర్పడుతున్నాయి. ట్రాఫిక్ సిగ్నళ్లకు మరమ్మతు చేయించాలని పట్టణ ప్రజలు పలుమార్లు బల్దియా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు చొరవచూపి ట్రాఫిక్ సిగ్నళ్లకు మరమ్మతు చేయించి ఇక్కట్లు తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## విద్యుత్ ఘాతంతో కార్మికుడు మృతి

శామీర్ పేట, (గరుడ వార్త) : విద్యుత్ ఘాతంతో కార్మికుడు మృతి చెందిన సంఘటన తుర్కపల్లి సమీపంలో చోటుచేసుకుంది.గురువారం గజ్వేల్ కు చెందిన గణేష్ తుర్కపల్లి, కొల్తూర్ మధ్యలో విద్యుత్ మరమ్మత్తులు చేస్తుండగా విద్యుత్ షాక్ కు గురై మృతి చెందాడు. విషయం తెలిసిన బంధువులు తుర్కపల్లి కొల్తూర్ రహదారిపై పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే గణేష్



మృతి చెందాడని ఆరోపించారు. విద్యుత్ అధికారులు సంఘటన స్థలానికి రావాలని బంధువులు డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న జీనం వ్యాలీ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. విద్యుత్ అధికారులు సంఘటన స్థలానికి రాకపోవడంతో మృతుడి బంధువులకు పోలీసులు నచ్చ చెప్పారు. ఫిర్యాదు చేస్తే మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి మరొకరికి తీవ్ర గాయాలు...



శామీర్ పేట, (గరుడ వార్త) : గుర్తు తెలియని వాహనం ఢీకొనదంతో ఓ వ్యక్తి మృతి మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్రగాల తీవ్ర గాయాలైన సంఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వీరాల ప్రకారం శామీర్ పేట మండలం మాజీద్ పూర్ గ్రామానికి చెందిన కే . వెంకటస్వామి(56) వృత్తి రైతు. అదే గ్రామానికి చెందిన అబ్బగొని బిక్షపతి తో కలిసి ద్విచక్ర వాహనంపై మాజీద్ పూర్ నుంచి శామీర్ పేట వైపు వస్తుండగా గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో వెంకటస్వామికి తీవ్ర గాయాలు కాగా బిక్షపతికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షేత్రగాత్రులను ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారు. వెంకటస్వామిని మెరుగైన చికిత్స నిమిత్తం తిరుమలగిరిలోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ వెంకటస్వామి తుది శ్వాస విడిచాడు. బిక్షపతి ఆర్వీఎం ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు శామీర్ పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నిబంధనతో సరి.. చిత్తశుద్ధి ఏది?

ధర్మపురి : పట్టణాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నీటి వినియోగం కూడా పెరుగుతోంది. కానీ సంరక్షణ చర్యల్లో ప్రజల బాధ్యతరాహిత్యం, అధికారుల నిర్లక్ష్యంతో విఫలమవుతున్నారు. దీంతో భూగర్భజలాలు పడిపోయి ఏటా వేసవిలో నీటి కష్టాలు నెలకొంటున్నాయి. అప్పటికప్పుడు అధికారులు, ప్రజాప్రతినిధులు తాత్కాలిక చర్యలతో చేతులు దులుపుకొంటున్నారు. కానీ శాశ్వత పరిష్కారాలపై దృష్టి పెట్టడం లేదు. పట్టణాల్లో ఇంటి నిర్మాణ సమయంలో తప్పకుండా ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకోవాలనే నిబంధన ఉంది. కానీ జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి పురాల్లో అమలు కావటం లేదు. రోజురోజుకు పట్టణాల విస్తీర్ణం పెరుగుతోంది. దారులన్నీ సీసీ రోడ్లుగా మారుతుండటంతో వాన నీరు ఇంకే పరిస్థితి లేదు. మరోవైపు నిర్వహణ లోపంతో తవ్విన ఇంకుడుగుంతలు కనిపించటం లేదు.

**అధికారుల అలసత్వం**

టీజీబీపాస్ చట్టం ప్రకారం భవన నిర్మాణానికి అనుమతి పొందాలంటే ఇంకుడుగుంత నిర్మాణం సైతం చేపట్టాలి. 200 చదరపు మీటర్ల విస్తీర్ణ భవనాలు, బహుళ అంతస్తుల నిర్మాణాల్లో తప్పనిసరిగా ఇంకుడు గుంత ఉండాలి. ఇందుకు నిర్మాణ సమయంలో కనీసం రూ.2 వేలు చెల్లించాలి. ఏర్పాటు చేసుకుంటే ఆ రుసుము అధికారులు వాపసు ఇస్తారు. కాని అనేక మంది అశ్రద్ధ చూపుతున్నారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు సైతం నిబంధనలను అమలు పరచటంలో విఫలమవుతున్నారు. వ్యక్తిగత, వాణిజ్య సముదాయాల్లో ఎన్ని ఇంకుడు



గుంతలు ఉన్నాయి? ఎన్ని నిర్మించాలనే విషయాలపై పుర అధికారులకే స్పష్టత లేకపోవడం వారిలోని చిత్తశుద్ధి లోపం కన్పిస్తోంది.

**నిర్వహణలో నిర్లక్ష్యం**

ప్రభుత్వ కార్యాలయాలు, పట్టణాల్లో నిర్మించిన ఇంకుడుగుంతలు ఆనవాళ్లు కోల్పోయాయి. 2022లో అప్పటి ప్రభుత్వం నిర్ణీత లక్ష్యాలను ఇచ్చి జగిత్యాల వ్యాప్తంగా అన్ని పురపాలకాల్లో 121 ఇంకుడుగుంతల నిర్మాణం యుద్ధప్రాతిపదికన చేపట్టింది. నిర్వహణ లేక అవి అధ్వానంగా మారాయి. పిచ్చిమొక్కలు, పూడికతో నిండిపోయాయి.

**సదస్సులతో అవగాహన**

ధర్మపురి పురపాలికలో ఇంకుడుగుంతల నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం. నూతన ఇంటి నిర్మాణానికి తప్పనిసరిగా ఇంకుడుగుంతలకు రుసుం చెల్లించిన తర్వాతే అనుమతులు ఇస్తున్నాం. పాత వాటిని గుర్తించి వృథా నీరు అందులోకి వెళ్లేలా చర్యలు తీసుకుంటాం. వచ్చే వర్షాకాలం ప్రారంభంలో ఇంకుడుగుంతలపై సదస్సులను ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తాం.
రాజశేఖర్, ధర్మపురి పుర కమిషనర్

## మళ్లీ వచ్చింది.. మండేకాలం..!

సూర్యాపేట : వర్షాకాలం ఆరంభానికి ముందు మురిపించిన వరుణుడు అనంతరం ముఖం చాటేశాడు. జిల్లా వ్యాప్తంగా జూన్ నెలలో సాధారణం కంటే 24 శాతం లోటు వర్షపాతం నమోదైంది. రెండు రోజులుగా వాతావరణం ఎండాకాలన్ని తలపిస్తోంది. తీవ్ర ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మధ్యాహ్నం సమయంలో బయటకు రావడానికి జంకుతున్నారు. జిల్లాలో ఇప్పటికే పత్తి పంట ఎండుముఖం పడుతోంది. మరికొద్ది రోజులు పరిస్థితి ఇలానే ఉంటే పంట పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఆశలు ఆవిరి....**

జిల్లాలో మే నెలలో ముందస్తుగా వర్షాలు కురవడం, రుతు పవనాలు ముందుగా రావడంతో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని అన్నదాతలు ఆశించారు. అందుకు భిన్నంగా జూన్ నెలలో చిన్నచిన్న జల్లులు మినహా భారీ వర్షం కురిసిన దాఖలాలు నేటికీ కనిపించలేదు. జూన్‌లో సాధారణ వర్షపాతం 192.9 మి.మీ కాగా కేవలం 120.6 మి.మీ మాత్రమే నమోదైంది. అవసరమైన నీటి లభ్యత లేకపోవడంతో వరి సాగు చేయాలనుకున్న అన్నదాతలకు ఎదురు చూపులు తప్పడం లేదు. రెండు రోజులుగా సాయంత్రం సమయంలో మేఘాలు కమ్ముకుంటున్నా వర్షం కురవడం లేదు. జిల్లాలో దాదాపు 4.89 లక్షల ఎకరాల్లో



వివిధ పంటలు సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. కాగా ఇప్పటి వరకు దాదాపు లక్ష ఎకరాల్లోనే పంటలు సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఎక్కువగా వర్షాధార పంటలే ఉండటంతో ఈ పరిస్థితి నెలకొంది.

సూర్యాపేట పట్టణం విద్యానగర్‌లో భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లలో నీటిమట్టం పూర్తిగా తగ్గిపోయింది. వేసవి కాలంలో ట్యాంకర్ల ద్వారా పలువురు నీటిని తెప్పించుకున్నారు. వర్షాకాలం మొదలైనా నేటికీ మోస్తారు వర్షాలు కురవకపోవడంతో నీటికోసం ఇక్కట్లు తప్పడం లేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా వర్షాకాలంలో సైతం మూడు, నాలుగు రోజులకోసారి ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకుంటు న్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ చిత్రంలో కనిపిస్తున్న పత్తి పంట ఆత్మకూర్(ఎస్) మండలంలోనిది. విత్తుకుని నెల రోజులు కావొస్తున్నా ఏ మాత్రం ఎదుగుదల లేదు. సరైన సమయంలో వర్షాలు కురిస్తే ఇప్పటికే కలుపు తీయడంతో పాటు యూరియా కూడా చల్లేవారమని.. వానలు లేకపోవడంతో మొక్కల ఎదుగుదల లేక పత్తిపంటకు తీవ్రనష్టం వాటిల్లుతోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఒడిసిపడితేనే జలం.. భూగర్భానికి బలం

సూర్యాపేట: వాన నీటిని ఒడిసిపట్టేలా పురపాలికల్లో ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వాననీటిని భూమిలోకి పంపితే భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుంది. పట్టణాల్లో చేపడుతున్న 100 రోజుల ప్రణాళికలో ప్రతి నివాసంలో దీనిని నిర్మించుకొనేలా చర్యలు తీసుకోవాలని పుర కమిషనర్లకు రాష్ట్ర పురపాలికశాఖ నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. ఆ దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నారు.

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 19 పురపాలక సంఘాలున్నాయి. వాటిలో 2,36,556 నివాసాలున్నాయి. వీటిలో 90 శాతానికి పైగా ఇంకుడు గుంతలు లేవు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఇంకుడు గుంతలు లేని ఇళ్ల గుర్తింపునకు వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, పారిశుద్ధ్య జవాన్లతో సర్వే బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు ఇళ్లకు వెళ్లి ఇంకుడుగుంతలు ఉన్నాయో లేదో నిర్ధారిస్తారు. లేకుంటే నిర్మించుకోవడానికి నెల రోజులు గడువు ఇస్తారు. తర్వాత ఇంకుడు గుంత తవ్వకుంటే నోటీసులు జారీ చేస్తారు.

కొత్త ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇచ్చే సమయంలో బోరుబావి వద్ద తప్పనిసరిగా ఇంకుడు గుంత నిర్మించుకొనేలా పురపాలికలు కఠినంగా వ్యవహరించాలని ప్రణాళికా విభాగాలకు సీడీఎంఏ నుంచి ఆదేశాలు



ఉన్నాయి. అయినా పట్టింపులేక ఈ ప్రక్రియ అనుకున్న రీతిలో సాగడం లేదు. ఇంటి అనుమతిలిచ్చే ముందే దస్త్రంలో ఇంకుడు గుంత తప్పనిసరి అని ఉంటుంది. స్థలం విస్తీర్ణంతో నిమిత్తం లేకుండా ప్రతి ఇంటి ఆవరణలోని బోరు వద్ద ఇంకుడుగుంత ఉండాలన్న నిబంధన ఉంది. కాగా నూతన ఇంటి నిర్మాణం చేపట్టే వారు దీనిని పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

**చర్యలు తీసుకుంటాం**

–సీహెచ్ హనుమంతరెడ్డి, పుర కమిషనర్, సూర్యాపేట

వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఇంటింటి సర్వే చేపట్టేందుకు బృందాలను ఏర్పాటు చేస్తాం. లేనివాటిని గుర్తించి నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

## అన్నంలో పురుగులు.. తినలేక పస్తులు



పరిగి : సంక్షేమ గురుకులాలు, వసతి గృహాలు సమస్యలకు నిలయంగా మారుతున్నాయి. కలుషిత ఆహారంతో గతంలో జరిగిన ఘటనలతో ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. అయినా క్షేత్రస్థాయిలో చోటు చేసుకుంటున్న నిర్లక్ష్యం విద్యార్థులకు ప్రాణసంకటంగా మారుతున్నాయి. గతేడాది వరుసగా కుల్కచర్ల, పరిగి, వికారాబాద్ ప్రాంతాల్లోనూ విద్యార్థులు అవస్థలు పడ్డారు. తాజాగా మర్పల్లి మండల కేంద్రంలోని విద్యార్థులు అన్నంలో పురుగులు వచ్చాయని తినలేమని ధర్నాకు దిగారు. ఈ ఘటన మరువక ముందే అదే మండలంలోని సిరిపురం ఎస్సీ బాలుర వసతి గృహంలో మరో ఘటన జరగడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు.

**కొరవడిన పర్యవేక్షణ..**

మధ్యాహ్న భోజన నిర్వహణ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు ఎక్కడా కనిపించడం లేదు. అమలు చేసేందుకు కమిటీలున్నా పట్టించుకోవడం లేదు. గురుకులాలు, వసతిగృహాల వద్ద అపరిశుభ్రత నెలకొనడం, బియ్యాన్ని జల్లెడ పట్టకపోవడం తదితర కారణాలతో అన్నంలో పురుగులు వస్తున్నాయి. కలెక్టర్ మొదలుకుని మండల స్థాయి అధికారుల వరకు తరచూ భోజనాలు చేస్తున్నా, పునరావృతం అవుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. పాఠశాలల్లోనూ పలుచోట్ల వంటగదులు శుభ్రంగా లేవు. పైకప్పులు దెబ్బతిన్నాయి. చెట్లకింద భోజనం వండాల్సి వస్తోంది. కొన్ని వసతిగృహాల్లో ఇటీవల సరఫరా చేసిన బియ్యం కాకుండా, గతంలో పంపిణీ చేసినవి పురుగు పట్టినా, వాడడంతో విద్యార్థులు తినలేకపోతున్నారు.

**అమలు కాని మెనూ:** వసతిగృహాల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ కొందరు వసతిగృహ సంక్షేమాధికారులు (వార్డెన్లు) పాటించడం లేదు. హెడ్‌క్వార్టర్‌లో ఉండకపోవడం, పర్యవేక్షణ కొరవడటంతో సిబ్బంది ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. పోషకాహారాన్ని అందించడమే లక్ష్యమని ప్రభుత్వం చెబుతున్నా, గాడితప్పి విద్యార్థులు అర్ధాకలితో అలమటించాల్సి వస్తోంది.

**నాణ్యమైనవి వినియోగించేలా చర్యలు..**

మర్పల్లి ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాం. పాత బియ్యం వినియోగించడంతో నల్ల పురుగులు వచ్చాయని గుర్తించాం. వాటిని తిప్పి పంపి, కొత్తగా వచ్చిన వాటిని వాడాలని సంక్షేమాధికారికి ఆదేశాలు జారీ చేశాం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడుతున్నాం. అవసరమైతే జల్లెడ పట్టించి నాణ్యమైన బియ్యం వాడుతాం.

కమలాకర్‌రెడ్డి, గిరిజన సంక్షేమాధికారి

**దర్యాప్తు కమిటీని నియమించాం**

మర్పల్లిలో కేజీబీవీలో చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి దర్యాప్తు కమిటీ నియమించాం. ఎంపీడీవో, తహసీల్దారుతో కూడిన మరో కమిటీని కూడా కలెక్టర్ ఏర్పాటు చేశారు. నివేదిక రాగానే చర్యలు చేపడతాం.

రేణుకాదేవి, జిల్లా విద్యాధికారిణి

## సర్కారు జాగా.. కనిపిస్తే పాగా



శంకరపట్నం: శంకరపట్నం మండలంలోని పలు గ్రామాల్లో సర్కారు స్థలాలను కొందరు యథేచ్ఛగా ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. చెరువు శిఖం, కుంట భూములు, పల్లె శివారులోని ప్రభుత్వ భూములను దర్జాగా ఆక్రమిస్తున్నారు. ఇళ్ల పట్టాలు లేకపోయినా.. గ్రామ పంచాయతీల అనుమతి తీసుకోకుండానే, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా స్థానిక అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడటంలేదు.

**ఉదాహరణలు కొన్ని ఇలా..**

కేశవపట్నంలో ఇటీవల ఓ వ్యక్తి జాతీయ రహదారి ఆనుకొని ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టాడు. పనులు తుది దశకు చేరినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

కరీంపేట్ గ్రామంలో ఒకరు గ్రామ పంచాయతీ కార్యాలయానికి సంబంధించిన స్థలంలో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నా.. ఇప్పటివరకు అధికారులు ఆ దిశగా వెళ్లలేదు. ఆక్రమించినట్లు తెలిసినా చర్యలకు ఉపక్రమించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం.

ఎరడపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద కొందరు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు ప్రారంభించారు.

శంకరపట్నం వాగు ప్రాంతంలోని సర్కారు స్థలంలో శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని స్థానికులు ఇటీవల స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించే లోపు ఆ భూమి ఆక్రమణకు గురవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. మండలంలో బయటకు రాని ఆక్రమణలు ఇంకెన్నో ఉన్నాయి. అక్రమ ఇళ్ల నిర్మాణాలపై గ్రామాల ప్రత్యేకాధికారులతోపాటు పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. కొన్ని నిర్మాణాలు పూర్తికాగా, మరికొన్ని తుది దశలో ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరముంది.

**కార్యదర్శులదే బాధ్యత**

ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడం చట్ట విరుద్ధం. అలాంటి చోట నిర్మాణాలు చేపడితే భవిష్యత్తులో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మండలంలో ఆక్రమణల విషయం మా దృష్టికి రాలేదు. అక్రమ నిర్మాణాలు వెలిస్తే ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులే బాధ్యత వహించాల్సి ఉంటుంది. – కృష్ణప్రసాద్, ఎంపీడీవో

## తప్పులు.. జనన ధ్రువీకరణకు తిప్పలు

ధర్మపురి : నేరెల్లకు చెందిన దావనపెల్లి పూజ ఏప్రిల్ 29న జగిత్యాలలోని మాతాశిశు ఆసుపత్రిలో పాపకు జన్మనిచ్చింది. జనన ధ్రువపత్రం కోసం దరఖాస్తు చేసేందుకు మీ సేవకు వెళ్తే ఆన్‌లైన్‌లో దావనపెల్లికి బదులు దావన్‌పెల్లి అని వచ్చింది. ఇంటి పేరులో ఏ అనే అక్షరం పడకపోవడం, చిరునామా ముందు ఇంటి నంబరు లేకపోవడం అడ్రస్ నమోదు సరిగా కాలేదు. దీంతో అఫిడవిట్ కోసం రూ.300 వరకు అదనంగా ఖర్చు చేయాల్సి వచ్చింది.

జిల్లాలో ఆసుపత్రుల్లో జనన ధ్రువీకరణపత్రాల్లో వివరాలు తప్పుగా నమోదు చేయడంతో పలువురు ఇబ్బందులు పడుతున్నారు. తప్పుగా నమోదయిన వివరాలు సరి చేసుకోవడానికి మీసేవలో దరఖాస్తుతోపాటు అఫిడవిట్ జత చేయాల్సి రావడంతో రూ.300 నుంచి రూ.400 వరకు అదనంగా ఖర్చవుతున్నట్లు పలువురు వాపోతున్నారు. జగిత్యాల జిల్లాలో 44 ప్రైవేటు ఆసుపత్రులతోపాటు జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్లలోని ప్రధాన ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు జరుగుతుంటాయి. జూన్ నెలలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 396 మంది శిశువులు జన్మించగా ప్రైవేటు ఆసుపత్రుల్లో 278 మంది శిశువులు జన్మించారు.

**నమోదు ఇలా..**

ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం కోసం వెళ్లినప్పుడు ఆధార్‌కార్డు ఆధారంగా సంబంధిత డాక్టర్ వివరాలను ధ్రువీకరిస్తారు. అనంతరం సిబ్బంది ఆధార్‌కార్డులో విధంగా తల్లి, తండ్రి పేర్లు, చిరునామా నమోదు చేయాలి. ఈ వివరాలన్నీ ఆ ఆసుపత్రి పట్టణ పరిధిలో ఉంటే మున్సిపల్, గ్రామ పరిధిలో ఉంటే పంచాయతీ లాగిన్‌కు వెళ్తాయి. దీని ఆధారంగా జనన ధ్రువపత్రం కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకుంటే వారం రోజుల్లో ధ్రువపత్రం జారీ అవుతుంది.

**తప్పులు జరిగేది ఇలా..**

తండ్రి, తల్లి పేరులో అక్షర దోషాలు, పేరుకు ముందు ఇంటి పేరు లేకపోవడం, చిరునామాలో ఇంటి నెంబరు లేకపోవడం, స్పష్టంగా చిరునామా లేకపోవడం, కొన్నిసార్లు జెండర్ నమోదులో తప్పులు దొర్లడంతో ఆధార్‌కార్డు తీసేటప్పుడు, ఇతర సమయాల్లో ఇబ్బందులు



ఎదుర్కొంటున్నారు. ఇలా జరిగినప్పుడు తప్పనిసరిగా సవరణ కోసం మళ్లీ మీ సేవలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. సవరణ కోసం డబ్బులు, సమయం వృథా అయ్యే అవకాశం ఉంటుంది.

**పాటించాల్సిన జాగ్రత్తలు**

ప్రసవ సమయంలో కుటుంబ సభ్యులు ఆధార్‌కార్డు ఆధారంగా ఇంటి పేరుతో సహా పేర్లను నమోదు చేయించాలి. ఇంటి నెంబర్‌తోపాటు పూర్తి చిరునామా నమోదు చేసేలా దగ్గరుండి చూసుకోవాలి. జెండర్ నమోదును కూడా పరిశీలించుకోవాలి. మౌఖికంగా చెప్పకుండా సిబ్బందికి ఆధార్‌కార్డు ఇచ్చి నమోదయ్యేలా చూడాలి. ఆసుపత్రిలో వివరాలను నమోదు చేసేటప్పుడు సరిగా చూసుకుంటే సవరణ చేయించుకోవాల్సిన అవసరం ఉండదు.

నమోదు చేసేలా ఆదేశిస్తాం

కుటుంబ సభ్యులు సిబ్బందికి అందించే సమాచారాన్ని ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకోవాలి. ఆధార్‌లో ఉన్న విధంగా సమాచారాన్ని ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేసేలా సిబ్బందిని ఆదేశిస్తాం.

– డాక్టర్ శ్రీనివాస్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి, జగిత్యాల

## పల్లె పోరు.. కసరత్తు జోరు

నాంపల్లి: స్థానిక సంస్థల ఎన్నికలకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపిన విషయం విదితమే. దీనిని అనుసరించి ఆర్డినెన్స్ జారీ చేయడంతో పాటు సామాజిక వర్గాల వారీగా రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. ఎన్నికల సంఘం ఆదేశానుసారం మండలం, జిల్లా పరిషత్ ప్రాదేశిక స్థానాల నిర్ధారణ ప్రక్రియ పూర్తి చేసేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు. దీంతో పాటు గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటర్ల ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు యంత్రాంగం సమాయత్తం అవుతోంది. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే నోటిఫికేషన్ జారీ చేయగా, రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ పూర్తికి యంత్రాంగం సిద్ధంగా ఉంది.

**గత ఎన్నికలకు భిన్నంగా..**

ఇప్పటి వరకు జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన సామాజిక వర్గాల నిష్పత్తి ఆధారంగా జిల్లాను యూనిట్గా



తీసుకొని ఎంపీటీసీ స్థానాలు, సర్పంచి పదవుల రిజర్వేషన్లను ఖరారు చేశారు. మండలం యూనిట్గా వార్డు సభ్యుల రిజర్వేషన్లు నిర్ధారించారు. రానున్న ఎన్నికల్లో మండలం యూనిట్గా ఎంపీటీసీ స్థానాలు, సర్పంచి పదవుల రిజర్వేషన్లు ఖరారు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు, ఆ తర్వాత పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి అనుగుణంగా నల్గొండ జిల్లాలో మండల, జిల్లా పరిషత్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన కసరత్తు పూర్తి చేసే పనిని యుద్ధ ప్రాతిపదికన చేపట్టే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

**బీసీ రిజర్వేషన్లకు ఆమోదం లభిస్తే..**

మంత్రి మండలి నిర్ణయం మేరకు స్థానిక సంస్థల రిజర్వేషన్ల ఖరారుపై ప్రభుత్వ ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం తెలపాలి. ఈ సారి నిర్వహించే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం భారీగా పెరగనుంది.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు అవకాశం ఉంటే.. నల్గొండ జిల్లాలోని 353 ఎంపీటీసీ స్థానాల్లో బీసీలకు 148–149 స్థానాలు రిజర్వ్ కానున్నాయి. 868 గ్రామ పంచాయతీల్లో 364–365 స్థానాలు బీసీలకు దక్కే అవకాశం ఉంది. జిల్లాలో మొత్తం స్థానాల్లో 50 సీట్లు మహిళలకు కేటాయించనున్నారు. వీటిలో సామాజిక వర్గాల వారీగా రిజర్వేషన్లు అమలు చేయనున్నారు.

2018లో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 27 శాతం బీసీలకు, 15 శాతం ఎస్సీలకు, 6 శాతం ఎస్టీలకు సీట్లు కేటాయించారు.

## పరీక్షలో నెగ్గిన భగీరథ

సిద్దిపేట : ప్రభుత్వం ఇంటింటికి సురక్షిత మంచినీటిని సరఫరా చేస్తోంది. మిషన్ భగీరథ గ్రిడ్ ద్వారా సరఫరా అయ్యే నీటిని శుద్ధి చేసిన తర్వాత గ్రామాల్లో ప్రజలకు నీటిని అందిస్తున్నారు. కొందరు తాగడానికి ఉపయోగించడం లేదు. ప్రైవేటు నీటి శుద్ధి ప్లాంట్ల వద్దనే కొనుగోలు చేసి తాగుతున్నారు. మిషన్ భగీరథ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. లీకేజీల కారణంగా ప్రజలకు అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో నీటి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించగా పూర్తిస్థాయిలో స్వచ్ఛతతో ఉన్నాయని అధికారులు తేల్చారు.

**నియోజకవర్గంలో 300 చొప్పున..**

భగీరథ గ్రిడ్ నుంచి గ్రామాల్లోని మంచినీటి ట్యాంకులకు నీరు వస్తోంది. కొన్ని చోట్ల నీరు సరిపోకపోవడంతో ఆయా గ్రామాల్లో స్థానిక నీటి వనరుల నుంచి నీటిని ట్యాంకుల్లోకి పంపిస్తున్నారు. అక్కడి కుళాయిల ద్వారా ప్రతి రోజు ప్రజలకు సరఫరా చేస్తున్నారు. ప్రతి నెల నీటి నమూనాలు సేకరిస్తున్నారు. జూన్‌లో మొత్తం 1500 నమూనాలకు పరీక్షలు చేపట్టారు. ప్రతి నియోజకవర్గంలో రోజుకు మూడు చొప్పున నెలకు 300 వరకు పరీక్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సిద్దిపేటలోని మిషన్ భగీరథ భవన్‌లో నిర్వహించారు. 50 నమూనాలను బ్యాక్టీరియా లాజికల్, 250 నమూనాలను రసాయనిక పరీక్షలు చేశారు. పంచాయతీల్లో క్రమం తప్పకుండా నీటి పరీక్షలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ట్యాంకుల నుంచి సరఫరా చేసే నీరు పైపులైన్ లీకేజీలతో కలుషితం అయ్యే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

సందేహం లేకుండా తాగొచ్చు : శ్రీకాంత్, మిషన్ భగీరథ ఈఈ

మిషన్ భగీరథ నీరు తాగడం ఆరోగ్యకరం. ప్రస్తుతం భగీరథ ద్వారా ఇంటింటికీ శుద్ధమైన నీటిని అందిస్తున్నాం. ప్రజలు ఎలాంటి అనుమానాలు లేకుండా తాగవచ్చు.

## కోచ్ నియామకానికి పచ్చజెండా

మెదక్ : గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలకు కొదవ లేదు. వారికి సరైన శిక్షణ లేక వెనకడుగు వేస్తున్నారు. దీన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకో శిక్షకుడిని నియమించాలని నిర్ణయించింది. దీంతో మెదక్‌లోని స్పోర్ట్స్ అథారటీ ఆఫ్ ఇండియా (సాయ్) అవుట్‌డోర్, పీఎన్ఆర్ స్టేడియాలకు కోచ్‌లను నియమించే అవకాశం ఉంది.

**పర్యవేక్షణ కొరవడి..**


మెదక్‌లోని సాయ్ అవుట్‌డోర్ స్టేడియంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు రూ.7.50 కోట్లతో సింథటిక్ ట్రాక్ నిర్మాణం, ఫుట్‌బాల్ మైదానం ఏర్పాటు చేశారు. అందుబాటులోకి తీసుకొచ్చి ఏళ్లు గడుస్తున్నా కోచ్, నిర్వాహకులను నియమించలేదు. దీంతో నిర్వహణ కొరవడింది. రూ.కోట్లు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన మైదానం నిరుపయోగంగా మారింది. సరైన పర్యవేక్షణ లేక ఆట వస్తువులు ధ్వంసమయ్యాయి. మైదానం అధ్వానంగా మారింది. నిబంధనల ప్రకారం ఆరుగులు శిక్షకులు, సిబ్బంది, అటెండర్లు, కాపలాదారులు ఉండాలి. పారిశుద్ధ్య కార్మికులను నియమించాలి. ఇందుకు ప్రభుత్వాలకు పలుమార్లు ప్రతిపాదనలు పంపించినా ప్రయోజనం లేకపోయింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కోచ్‌ను నియమించడానికి అంగీకరించడంతో క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**ఉత్తర్వులు వస్తాయని.. : దామోదర్‌రెడ్డి, డీవైఎస్‌వో**

స్టేడియానికి ఒకరి చొప్పున కోచ్‌ను నియమించాలని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ నుంచి ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు రెండు స్టేడియాలకు కోచ్‌లు కావాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదించాం. స్యాట్ నుంచి త్వరలో ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు వస్తాయని ఆశిస్తున్నాం.

# సగమే దోస్త్

కరీంనగర్ : డిగ్రీ కళాశాలల్లో చేరికలు తగ్గుతున్నాయి.. 2025-26 విద్యా సంవత్సరంలో డిగ్రీ ప్రవేశాలకు నిర్వహించిన దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ)లో సగం మేరకే విద్యార్థులు ప్రవేశాలు పొందారు. కళాశాలల్లో ప్రవేశాలకు మూడు విడతల్లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ప్రవేశాల ప్రక్రియను ఉన్నత విద్యా మండలి ఇటీవల పూర్తి చేసింది. శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో 13 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, 3 స్వయం ప్రతిపత్తి (అటానమస్) కళాశాలలు, ఎయిడెడ్ 2, సాంఘిక సంక్షేమ 3, బీసీ సంక్షేమ 3, గిరిజన సంక్షేమ కళాశాలలు 2 ఉన్నాయి. వీటితోపాటుగా 58 ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. మొత్తం 36 వేల సీట్లు ఉండగా ప్రైవేటు, స్వయం ప్రతిపత్తి కళాశాలల్లో కొంతమేర ప్రవేశాలు మెరుగ్గా ఉన్నా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 30 నుంచి 40 శాతం మేరనే భర్తీ అయ్యాయి.



**వృత్తివిద్యా కోర్సుల వైపు మొగ్గు**

విద్యార్థులు, తల్లిదండ్రులు సంప్రదాయ డిగ్రీల కన్నా వృత్తి విద్యా కోర్సుల వైపు ఆసక్తి చూపుతున్నారు. అటానమస్, బీసీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలల్లో వసతి సౌకర్యం ఉండటంతో కొందరు అటువైపుగా వెళ్తున్నా...జీవితంలో తొందరగా స్థిరపడే అవకాశాలున్న కోర్సులపై దృష్టి పెడుతున్నవారే ఎక్కువ. ఈ క్రమంలో ఇంజినీరింగ్, ఎంబీబీఎస్, తదితర ప్రొఫెషనల్ కోర్సుల్లో చేరడానికి ఆసక్తి చూపుతున్నారు.

**కొంత ఆదరణ తగ్గింది..**ఇంటర్‌లో ఎంపీసీ పూర్తి చేసినవారు ఇంజినీరింగ్ వైపు, అలాగే బైపీసీ పూర్తి చేసిన విద్యార్థులు ఎంబీబీఎస్, బీ.ఫార్మసీ, ఫాం-డి, అగ్రికల్చర్ ఇంజినీరింగ్ వైపు చూస్తున్నారు. దాంతో సాధారణ డిగ్రీకి కొంత ఆదరణ తగ్గింది. ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ పూర్తి అనంతరం మరో విడత దోస్త్‌లో విద్యార్థులు చేరనున్నారు - రామకృష్ణ, దోస్త్ కోఆర్డినేటర్

# కాసులే లక్ష్యం.. నిబంధనలు పాటించం

మెట్‌పల్లి: అనారోగ్యానికి గురైనవారికి సంబంధించిన వ్యాధి నిర్ధారణ పరీక్షలను కనీస నిబంధనలు పాటించకుండా జిల్లాలోని కొన్ని డయాగ్నోస్టిక్ ల్యాబ్‌ల్లో ఇష్టారాజ్యంగా చేస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నెలలో మెట్‌పల్లిలో వైద్యారోగ్యశాఖ అధికారులు ల్యాబ్‌ల్లో చేసిన తనిఖీల్లో నిబంధనలు పాటించడం లేదని.. రెండింటికి నోటీసులు జారీ చేయడంతో ఆరోపణలకు బలం చేకూరింది.

**అర్హత లేనివారే అధికం**

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం వైద్యారోగ్యశాఖ నుంచి ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్ ల్యాబ్‌లు, స్కానింగ్ కేంద్రాలు అనుమతి తీసుకోవాలి. వైద్యులు, సిబ్బంది, విద్యార్హత, భవనం, వసతులు తదితర వివరాలు పూర్తిగా పరిశీలించాక అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. జిల్లాలో 292 ప్రైవేట్ ఆసుపత్రులు, 13 డయాగ్నోస్టిక్ ల్యాబ్‌లు రిజిస్టర్ చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. కాని క్షేత్రస్థాయిలో అధిక సంఖ్యలో ల్యాబ్‌లున్నాయి. వీటిని చిన్నపాటి గదుల్లో నిర్వహించడమే కాకుండా అర్హత లేనివారు నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**అవసరం లేకున్నా నిర్ధారణ పరీక్షలు**

వైద్య నిపుణుల ప్రిస్క్రిప్షన్ ఆధారంగానే అర్హత ఉన్నవారు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలి. ఎంబీబీఎస్ వైద్యుడు లేదా బయో కెమిస్ట్రీ, మైక్రో బయాలజిస్ట్, పాథాలజిస్ట్‌లు నివేదికను నిర్ధారించాలి. కాని



ఈ ప్రక్రియ మొక్కుబడిగా సాగుతుందనే విమర్శలున్నాయి. సీజనల్ వ్యాధుల సమయంలో కొందరు ఆర్ఎంపీ, పీఎంపీలు పంపిన రోగులకు అవసరం లేకున్నా ఇష్టానుసారంగా పరీక్షలు చేస్తూ కాసులు దండుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. అలాగే ఒక్కోచోట ఒక్కోలా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు తనిఖీలు చేస్తూ నోటీసులు ఇస్తున్నా.. పరిస్థితిలో మార్పు రావడం లేదని, నిర్వాహకులపై కఠినంగా వ్యవహరించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**తనిఖీలు పెంచి చర్యలు తీసుకుంటాం**

వైద్యారోగ్యశాఖ వద్ద రిజిష్టర్ చేసుకున్న డయాగ్నోస్టిక్ ల్యాబ్‌లను తనిఖీ చేశాం. నిబంధనల మేరకు రోగ నిర్ధారణ పరీక్షలు చేయాలి. పాటించనివారికి ఇదివరకే నోటీసులిచ్చాం. తనిఖీలు పెంచి నిబంధనలు పాటించనివాటిపై చర్యలు తీసుకుంటాం. - శ్రీనివాస్, జిల్లా ఉప వైద్యాధికారి

# గుత్తకు ఇస్తే నత్తకు ఇచ్చినట్లే



హైదరాబాద్: నగరంలో చినుకు పడిందంటే వాహనదారుల వెన్నులో వణుకే. ఎక్కడి ట్రాఫిక్ అక్కడే. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. ఇక భారీ వర్షం కురిస్తే ఇళ్లలోకి నీరు.. లోతట్టు ప్రాంతాలు జలమయం.. నగర జీవనం అస్తవ్యస్తం.. ఇదీ వరస. ఈ ఏడాది జూన్‌లో సగటు వర్షపాతంకంటే.. దాదాపు 65 శాతం తక్కువ వానలు కురిసినా అదే పరిస్థితి. వాననీరు నిలువకుండా జీహెచ్ఎంసీ, హైడ్రా ఎంత కృషి చేసినా అవుట్ లెట్స్ (నీరు బయటకు పంపేమార్గం) పూర్తి కాకపోతే వృథానే.

**ఇంకా టెండర్ దశలోనే..**

వరదనీరు సక్రమంగా పారేలా ఎస్ఎన్‌డీపీ ద్వారా నాలాల విస్తరణను బల్దియా 2020-21లోనే చేపట్టింది. గత ఏడాది రూ.667.28 కోట్లు కేటాయించి 40 పనులకు కార్యాచరణ రూపొందించింది. అయితే యంత్రాంగం నిర్లక్ష్యంతో పనులు నత్తతో పోటీ పడుతున్నాయి. కొన్ని ఇంకా టెండరు దశలోనే ఉన్నాయి. తవ్వకాలతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. పనులు చేసినా బిల్లులు రావడం లేదనే వాదన గుత్తేదారుల్లో ఉంది. కొన్ని జోన్లలో పనులకు ఇంకా సవివరణ ప్రాజెక్టు నివేదిక తయారు చేయాల్సి ఉంది.

**పనులు ప్రారంభించరే**

కొన్ని పనులకు టెండర్లు తెరిచి గుత్తేదారులతో అగ్రిమెంటు చేసుకున్నా.. పనులు ప్రారంభించడం లేదు. మరికొన్ని అగ్రిమెంట్లకు గుత్తేదారులే ముందుకు రావడం లేదట. కొన్ని పనులను 5 శాతం అధిక ధరలకే దక్కించుకున్నారు. చార్మినార్ జోన్‌లో పనులు నాసిరకంగా జరుగుతున్నాయనే ఫిర్యాదులున్నాయి. రూ.173 కోట్ల 13 పనులను ఇంతవరకు ప్రారంభించలేదు. నాలాలు అన్నీ వెడల్పు చేసి అవుట్‌లెట్స్‌కు కలిపి మూసీలోకి వరదసక్రమంగా వెళ్లేలా చేయాలి. ఖైరతాబాద్, కూకట్‌పల్లి, ఎల్‌బీనగర్, శేరిలింగంపల్లి జోన్లలో పనులు ఒప్పందాలు పూర్తి చేసుకున్నా అక్కడా ప్రారంభించలేదు.

**పైపై పూడికతీత!**

వర్షాలు వచ్చేనాటికి పూడికతీత పూర్తి చేయాలి. ఒక ఏడాదికి దాదాపు రూ.501.32 కోట్లు కేటాయించడం బల్దియా రికార్డు. 890 పనులు చేయాల్సి ఉండగా 373 చేసినట్లు రికార్డు చేశారు. గుత్తేదారులు 20 శాతం తక్కువకే టెండర్లను దాఖలు చేసి పూడిక తీయకుండానే తీసినట్లు రికార్డు చేస్తున్నారనే ఫిర్యాదులున్నాయి. నగరంలో దాదాపు 350 వరకు వాననీటి నిల్వ ప్రాంతాలున్నాయని హైడ్రా గుర్తించింది. 130 బృందాలను ఏర్పాటు చేసింది. మరోవైపు నాలాల ఆక్రమణలను గుర్తించి మూడు ప్రాంతాల్లో తొలగించింది.

**పూడికతీత పనులు ఇలా..**

మొత్తం పనులు 890

అంచనా వ్యయం రూ.501.32 కోట్లు

పూర్తయిన పనులు 373 నిధుల ఖర్చు రూ.210 కోట్లు

# సరిహద్దు.. ఫిర్యాదు వద్దు




హైదరాబాద్: మూడు రోజుల క్రితం.. ఎల్బీనగర్‌లోని రాచకొండ క్యాంపు కార్యాలయం ముందు వాహనం దగ్ధమైంది. ఎల్బీనగర్ పోలీసులు వివరాలన్నీ సేకరించారు. సరిహద్దు విషయంలో అనుమానమొచ్చి తర్జనభర్జన పడి నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధి అని నిర్ధారణకు వచ్చారు. అక్కడ కేసు నమోదు చేశారు.

సమస్యతో ఠాణాకు వచ్చేవారికి చట్టప్రకారం న్యాయం చేయాల్సిన పోలీసులు 'సరిహద్దు' పేరిట బాధితులకు చుక్కలు చూపిస్తున్నారు. జీరో ఎఫ్ఐఆర్ విధానం ఉన్నా 'మా పరిధి కాదు' అంటూ తిప్పి పంపుతున్నారు. ముఖ్యంగా కొత్త ఠాణాల మధ్య ఈ సమస్య ఎక్కువగా ఉంది. కొత్త పోలీస్‌స్టేషన్లు ఏర్పాటై రెండేళ్లు గడుస్తున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదు. కొన్ని సందర్భాల్లో సమస్య అంతా చెప్పాక.. ఫలానా ఠాణాకు వెళ్లమని సూచిస్తుండటంతో బాధితులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**ఠాణాలోకి అడుగుపెట్టగానే..**

చోరీ.. రోడ్డు ప్రమాదం.. దాడులు.. నేరం ఏదైనా బాధితులు ఠాణాకు వెళ్లి ఫిర్యాదు చేసినప్పుడు తొలుత జీడీలో నమోదు చేసి తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. కొన్ని ఫిర్యాదులకు న్యాయ సలహా తీసుకోవాల్సి ఉంటుంది. బాధితులు ఫిర్యాదు చేసేందుకు వెళ్లినప్పుడు రిసెప్షన్ దగ్గర ఉండే సిబ్బంది ఘటన జరిగింది ఎక్కడ? ఉండేది ఎక్కడ? అంటూ ప్రశ్నించి.. ఫలానా ఠాణాకు వెళ్లాలంటూ చెబుతున్నారు. సాధారణంగా ఠాణాకు వెళ్లి ఫిర్యాదు చేయాలంటే జంకే సామాన్యులు ఈ తీరుతో ఇబ్బంది పడుతున్నారు.

**కేవలం మహిళలపై నేరాలకే..**

వాస్తవానికి ఘటన ఎక్కడ జరిగినా బాధితులు సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు. సరిహద్దులతో సంబంధం లేకుండా అక్కడి పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి సంబంధిత ఠాణాకు బదిలీ చేయాలి. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది. కేవలం మహిళలపై నేరాల్లోనే దీన్ని అమలు చేస్తున్నారు. ఇతర ఘటనల్లో సంబంధం లేదనట్లు వ్యవహరిస్తున్నారు.

**గందరగోళంగా పేర్ల మార్పు**

హుమాయున్‌నగర్ పేరుతో ఏర్పాటైన ఠాణా భవనం మెహిదీపట్నంలో ఉండేది. ఇది గందరగోళానికి దారి తీయడంతో మెహిదీపట్నం ఠాణాగా మార్చారు.

ఫిల్మ్‌నగర్, హుమాయున్‌నగర్, గోల్కొండ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని కొన్ని ప్రాంతాలను కలిపి కొత్తగా టోలిచౌకి ఠాణా ఏర్పాటు చేశారు. సరిహద్దు, ఇతర సమస్యలతో నారాయణగూడ, మారేడ్‌పల్లి, బోయిన్‌పల్లి ట్రాఫిక్ ఠాణాలను తొలగించారు.

లా అండ్ ఆర్డర్ డివిజన్ల ప్రకారం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల హద్దులు నిర్ణయించి నాంపల్లి, అంబర్‌పేట, లంగర్‌హౌస్, బహదూర్‌పుర, నల్లకుంట ట్రాఫిక్ ఠాణాల పేర్లను గాంధీనగర్, ఉస్మానియా యూనివర్సిటీ, కుల్సుంపుర, ఛత్రినాక, సైదాబాద్‌గా మార్చారు. గోల్కొండ డివిజన్‌కు టోలిచౌకి, సెక్రటేరియట్ ఠాణాకు లేక్, హుమాయున్‌నగర్‌కు మెహిదీపట్నం, షాహినాయత్‌గంజ్‌కు గోషామహల్‌గా నామకరణం చేశారు.

# ఊరకే పోకుండా.. ఊరికో ఇంకుడు గుంత



బషీరాబాద్: గ్రామస్థులు వినియోగించిన నీటిని భూమిలోకి ఇంకించాలని అధికారులు చర్యలు చేపట్టారు. ప్రధాన మురుగు కాల్వల చివరన పెద్ద ఇంకుడు గుంత పనులు ప్రారంభించారు. మురుగు నీరంతా ఊరి చివరనున్న చెరువులు, వాగుల్లోకి లేదా నివాస ప్రాంతాల్లో నిల్వ ఉండి అపరిశుభ్రత నెలకొంటోంది. ఈ నేపథ్యంలో వృథా నీటినంతా భూమిలోకి ఇంకేలా ప్రణాళిక చేశారు. ప్రతి గ్రామంలో ఒకటి తప్పనిసరిగా, అవసరమైన చోట్ల రెండు, మూడు నిర్మించనున్నారు.

**స్వచ్ఛభారత్ నిధులతో..**

నాలుగు నియోజకవర్గాల పరిధిలో 594 పంచాయతీలు ఉన్నాయి. సుమారు 12లక్షలకుపైగా జనాభా నివాసం ఉంటున్నారు. ఐదేళ్ల క్రితం ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మాణం చేయించారు. కేవలం 30 శాతం గృహాల్లో మాత్రమే వీటిని నిర్మించారు. మిగతా వారు నిత్యం వినియోగించిన నీరు మురుగు కాల్వల ద్వారా ప్రవహిస్తోంది. దీంతో దోమలు ఉత్పన్నమై డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి విషజ్వరాల బారిన పడుతున్నారని వైద్యశాఖ తరచూ అవగాహన కల్పిస్తోంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. పంచాయతీరాజ్ శాఖ ఏఈ, మండల అభివృద్ధి అధికారులు పర్యవేక్షించనున్నారు. నిబంధనల ప్రకారం ఇసుక, కంకరతో కలిపి పైమూత బిగించనున్నారు. బషీరాబాద్, పెద్దేముల్, యాలాల, తాండూరు మండలాల్లోని ప్రతి మండలంలో నాలుగైదు గ్రామాలను ఎంపిక చేసి పనులు చేయిస్తున్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ 70శాతం నిధులు, పంచాయతీ ఆర్థిక సంఘం నిధులు 30 శాతం మొత్తం కలిపి రూ.92,747 నిధులు కేటాయించారు. జిల్లాలో మొత్తం 594 నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించారు.

**పనులు ప్రారంభించాం..**

అన్ని మండలాల్లో ముందుగా గ్రామాలను ఎంపిక చేసి పనులు ప్రారంభించాం. 300 చోట్ల ముగ్గు వేసి గుంతలు తీస్తున్నారు. ప్రతి పంచాయతీకి ఒకటి తప్పకుండా నిర్మించాలి. ఈ విధానంలో మురుగు నీరు ఇంకడంతోపాటు, పరిశుభ్రతకు దోహదపడుతుంది. ఇందుకోసం అందరూ సహకరించాలి.జయసుధ, జిల్లా పంచాయతీ అధికారిణి

# బాలికల్లేక వసతిగృహం మూసివేత

కరీంనగర్ : కరీంనగర్ మంకమ్మతోటలోని బీసీ బాలికల వసతిగృహం(ప్రీమెట్రిక్)లో చేరేందుకు విద్యార్థినులు రాకపోవడంతో మూతపడింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద కుటుంబాల వారికి ఏర్పాటు చేసిన ఇందులో గత విద్యాసంవత్సరం 14 మంది బాలికలు ఉన్నారు. నూతన విద్యాసంవత్సరంలో వసతిగృహంలో కొత్తగా చేరేందుకు బాలికలెవరూ ఆసక్తి చూపలేదు. దీంతో దాన్ని జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారులు మూసివేశారు.

ఇప్పటి వరకు వరకు ఉన్న బాలికలు కొందరు రామడుగులోని వసతిగృహానికి వెళ్లగా, మిగిలిన వారిలో కొందరు కేజీబీవీల్లో చేరారు. కళాశాలల్లో చదివేందుకు వివిధ ప్రాంతాల నుంచి కరీంనగర్‌కు వస్తుంటారు. వీరికి కరీంనగర్‌లో పోస్ట్ మెట్రిక్ వసతిగృహాల్లో సీట్లు





దొరకడంలేదు. చాలామంది ప్రవేశాల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ పరిస్థితుల్లో మూసివేసిన వసతిగృహాన్ని పోస్టు మెట్రిక్ విద్యార్థులకు ఉపయోగపడేలా మార్చాలని కోరుతున్నారు.

**న్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతాం**

విద్యార్థినులు కొత్తగా చేరని కారణంగా బీసీ బాలికల వసతిగృహాన్ని మూసివేశాం. పోస్టు మెట్రిక్ వసతిగృహంగా మార్చేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పెడతాం. - అనిల్ ప్రకాశ్, జిల్లా బీసీ సంక్షేమాధికారి

# ఆమ్యామ్యాల పర్వం.. చాటుమాటు ఒప్పందం



మల్యాల: విద్యుత్తుశాఖలో కొందరు ఉద్యోగులు ఆమ్యామ్యాలకు అలవాటుపడి.. నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వహించడం విమర్శలకు తావిస్తోంది. గ్రామాల్లో విద్యుత్తు స్తంభాల నిర్మాణం, కండక్టరు(తీగలు) అమర్చి కనెక్షన్ ఇవ్వడానికి, తొలగించడానికి అధికారులు వినియోగదారులను ముప్పుతిప్పలు పెడుతున్నారన్న ఆరోపణలున్నాయి. అనధికారికంగా చేసే ఇలాంటివాటికి 'లైన్ క్లియరెన్సు'(ఎల్‌సీ) తీసుకోవడం కుదరని కారణంగా.. అధికారులు అధికారికంగా ఎల్‌సీ తీసుకునే సమయంలో పనులు పూర్తి చేసి దండుకుంటున్నారని విశ్వసనీయ సమాచారం.

**స్తంభాలకు కన్షెకన్ ఇవ్వడానికి..**

మల్యాల మండలంలోని సర్వాపూర్ శివారులో ఇటీవల స్తంభాలకు కొత్తగా కనెక్షన్ ఇవ్వడానికి విద్యుత్తు ఉద్యోగి ఓ రైతుతో ఒప్పందం చేసుకున్నట్లు తెలిసింది. కనెక్షన్ ఇవ్వడానికి ఉపకేంద్రం నుంచి అధికారులు వేరే పనికి ఎల్‌సీ ఇచ్చిన సమయంలో విద్యుత్తు ఉద్యోగి సరైన జాగ్రత్తలు తీసుకోకుండా వేరే రాష్ట్రానికి చెందిన కార్మికుడితో పనులు చేయించే సమయంలో.. విద్యుదాఘాతానికి గురై స్తంభంపై నుంచి పడి గాయపడగా.. ఆ ఘటనను బయటకు పొక్కకుండా జాగ్రత్తపడ్డారు. అయితే ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియడంతో సదరు ఉద్యోగిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

**జిల్లా అధికారి ఆగ్రహం**

పలు గ్రామాల్లో విద్యుత్తు స్తంభాలకు ఉండాల్సిన తీగలు లేకపోవడంతో.. ఇటీవల మల్యాల, ముత్యంపేట గ్రామాల్లో పర్యటించిన జిల్లా విద్యుత్తు అధికారి సిబ్బందిని నిలదీసినట్లు తెలిసింది. మల్యాల అడ్డరోడ్డు సమీపంలో ఓ పాఠశాల భవన నిర్మాణానికి కొత్తగా విద్యుత్తు లైను నిర్మాణానికి ఓ ఉద్యోగి అధికారులకు తెలియకుండా పాఠశాల యజమానితో రూ.60 వేలకు ఒప్పందం కుదుర్చుకొని అందులో రూ.30 వేలు ముందస్తుగా డబ్బులు తీసుకొని 8 నెలలుగా పని పూర్తి చేయలేదు. దీంతో పాఠశాల యజమాని అధికారులకు ఫిర్యాదు చేశారు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం**

తమ సంస్థ ఉద్యోగి మల్యాల అడ్డరోడ్డు సమీపంలో విద్యుత్తు లైను నిర్మాణానికి పాఠశాల యజమాని వద్ద డబ్బులు తీసుకున్నట్లు తెలిసింది. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. వినియోగదారులు తమ కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకుంటే ఏ పనికి ఎంత ఖర్చవుతుందనే వివరాలతో అంచనా రూపొందించి.. ఆ ధర ప్రకారం పనులు పూర్తి చేయిస్తాం. మహేందర్, ఏడీఈ మల్యాల

# ధరలు దండి.. కూరలేని తిండి

భువనగిరి : కూరగాయల ధరలు పక్షం రోజుల నుంచి క్రమంగా పెరిగిపోయాయి. వర్షాభావ పరిస్థితులతో పాటు ఏటేటా కూరగాయల సాగు విస్తీర్ణం తగ్గుతుండటంతో ఇతర రాష్ట్రాలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. దిగుమతి భారంగా మారడంతో ధరల్లో భారీగా వ్యత్యాసం చోటుచేసుకుంటోంది. అన్ని రకాల కూరగాయల ధరలు పెరగడంతో ప్రజలు కొనలేకపోతున్నారు.

**ఇదీ పరిస్థితి**

పక్షం రోజుల క్రితం రూ.46 కిలో ఉన్న టమాట ప్రస్తుతం రూ.36కే లభిస్తోంది. అనంతపురం, కర్నూలుతో పాటు చిత్రదుర్గలో టమాట భారీ దిగుబడి వస్తుండటంతో నిత్యం హైదరాబాద్ బోయిన్‌పల్లి కూరగాయల మార్కెట్‌కు లారీల కొద్ది దిగుమతి అవుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పాటు జిల్లాకు బోయిన్‌పల్లి మార్కెట్ నుంచి కూరగాయలు వస్తున్నాయి. ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి మిర్చి, చిక్కుడు, బిన్నీస్, క్యారెట్, బెల్గాం నుంచి పచ్చిమిర్చి, ఊటీ నుంచి క్యారెట్ రాష్ట్రానికి దిగుమతి అవుతున్నాయి. గతంలో క్యారెట్ వికారాబాద్, శంషాబాద్ నుంచి మార్కెట్‌కు భారీగా వచ్చేది. వర్షాలు కురిసి, మరో కొత్త పంట వచ్చే వరకు ధరల పరిస్థితి ఇలాగే ఉంటుందని హోల్‌సేల్ కూరగాయల వ్యాపారి సకిలం రాజేంద్రప్రసాద్ చెబుతున్నారు. ధరల పెరుగుదలతో కూరగాయల విక్రయాలు తగ్గాయని ఆవేదన వ్యక్తం చేశారు.

# అందరికీ అందేనా!

జగిత్యాల : వానాకాలం-2025 సీజనుకుగాను రైతుభరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం నిధుల విడుదలను సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఎకరాకు రూ.6 వేల చొప్పున పెట్టుబడి సాయంగా ఇస్తుండగా.. సాగు యోగ్యంకాని భూములను గత సీజన్‌లోనే గుర్తించి పథకం నుంచి తొలగించారు. నూతన జాబితా ప్రకారం జిల్లాలో నమోదై ఉన్న మొత్తం 2,39,929 మంది రైతుల్లో దాదాపు సగం మంది వరకు రెండెకరాల్లోపు భూమి గలవారే కావడం గమనార్హం.

**గత యాసంగిలో 3 ఎకరాల వరకే..**

రాష్ట్ర ప్రభుత్వం 2025 గణతంత్ర దినోత్సవం రోజున మండలానికొక గ్రామాన్ని ఎంచుకొని.. ఆ గ్రామంలోగల మొత్తం మంది అన్నదాతలకు రైతు భరోసా నిధులను విడుదల చేసింది. ఈ క్రమంలో జిల్లాలోని 20 మండలాల్లో 20 గ్రామాలకు చెందిన 15,636 మందికి



రూ.15.45 కోట్లు విడుదలయ్యాయి. తదుపరి ఎకరం చొప్పున పెంచుతూ నిధులను విడుదల చేయగా దాదాపుగా 4 ఎకరాల భూమి వరకే నిధులు విడుదల చేశారు. 4 ఎకరాల్లోపు భూమిగల చాలామందికి నిధులు రాకపోవటం లేదా తక్కువ విస్తీర్ణానికి రావడం జరిగింది.

**నిరీక్షణ.. నిరాశ**

భూపరిమితి లేదని ప్రభుత్వం పేర్కొన్నా.. 4 ఎకరాలు పైబడి భూమి కలిగినవారికి నిధులివ్వక చాలామంది నిరాశ చెందారు. జిల్లాలో 380 గ్రామాలుండగా పథకాన్ని ప్రారంభించిన 20 గ్రామాల్లోని రైతులందరికీ మాత్రం భూపరిమితి లేకుండా నిధులందగా.. మిగిలిన అన్ని గ్రామాల్లో 4 ఎకరాలు పైబడిన వారికి నిధులు రాలేదు. ప్రస్తుతం ఎలాంటి భూపరిమితి విధించకుండా రైతులందరికీ నిధులిస్తామని పేర్కొన్నా.. ఎంతమందికి, ఎన్ని రోజుల్లో నిధులు అందుతాయనేది రైతులను వేధిస్తున్న ప్రశ్నగా మారింది.

# కమీషన్‌కు ఆశపడితే కటకటాలే

మీరేం చేయాల్సిన పనిలేదు. బ్యాంకు ఖాతా వివరాలు, వాటి లాగిన్ ఐడీలు ఇస్తే చాలు లావాదేవీలు జరిపినందుకు నెలవారీగా కమీషన్లు ఇస్తాం. లేకపోతే మీ పేరుతో బ్యాంకు ఖాతాలు తెరిచి మేం వాడుకుంటాం. కష్టపడకుండా డబ్బు సంపాదించడానికి ఇదో మార్గం..! ఇలాంటి బూటకపు మాటలతో సైబర్ నేరగాళ్లు అమాయకుల్ని పోలీసు కేసుల్లో ఇరికిస్తున్నారు. ఇటీవల నిందితుల్ని అరెస్టు చేసినప్పుడు ఎక్కువ మంది బ్యాంకు ఖాతాలు ఇచ్చిన వారే ఉంటున్నారు. వీరంతా కేవలం కమీషన్లకు ఆశపడి నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు ఇచ్చినవారే. పోలీసులు అరెస్టు చేశాక లబోదిబోమంటున్నారు. సైబర్ నేరగాళ్లు పోలీసుల నుంచి తప్పించుకోవడానికి ఇతరుల(మ్యూల్స్) బ్యాంకు ఖాతాలు వినియోగిస్తున్నారు. జనాన్ని మోసగించి కొట్టేసిన డబ్బు లావాదేవీలకు వాటిని ఉపయోగిస్తున్నారు.

**ఇవీ జాగ్రత్తలు**

సైబర్ నేరగాళ్లు టెలిగ్రామ్, వాట్సప్ ద్వారా సందేశాలు పంపిస్తూ బ్యాంకు ఖాతాల వివరాలకు వల వేస్తుంటారు. కమీషన్లు ఇస్తామని ఆశపెడితే నమ్మొద్దు.తాము ఇతరులకు బ్యాంకు ఖాతాల వివరాలు ఇచ్చి నెలవారీగా బాగా సంపాదిస్తున్నామని స్నేహితులు, బంధువులు, సన్నిహితులు చెబుతుంటారు. కుటుంబ సభ్యులైనా సరే నేరమని తెలుసుకోవాలి. గుర్తుతెలియని లేదా తెలిసిన వ్యక్తులకైనా బ్యాంకు ఖాతా లాగిన్‌ఐడీ వివరాలు ఇవ్వొద్దు. ః కొందరు నేరగాళ్లు కూలీలు, పేదల పేరుతో సేవింగ్స్, కరెంటు ఖాతాలు తెరుస్తున్నారు. వ్యక్తిగత గుర్తింపు పత్రాలు ఇవ్వొద్దు.

జిరాక్సు సెంటర్లు, ఇతర ప్రాంతాల్లో ఆధార్, పాన్ నకలు ఇచ్చేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి.

**ఒకవేళ మోసపోతే**

మన ప్రమేయం లేకుండా బ్యాంకు ఖాతాలు వినియోగిస్తున్నట్లు తెలిస్తే ఆలస్యం చేయకుండా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి బ్యాంకు అధికారులను సంప్రదించి సమస్యను వివరించాలి.

1930 టోల్‌ఫ్రీ నంబరు, %www.cybercrime.gov.in% వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయొచ్చు.

# నిబంధనలకు మట్టికొట్టి..!

నల్గొండ: రైతులకు ఉచితంగా ఇవ్వాల్సిన మట్టికి.. సవాలక్ష సాకులు పెడుతూ సతాయించే అధికారులు ఇటుక బట్టీల నిర్వాహకుల విషయంలో 'చూసీ చూడనట్లు' వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లాల్లోని ఇటుక బట్టీలకు పెద్ద ఎత్తున స్థానిక చెరువుల్లోని బంక మట్టిని ఇష్టారాజ్యంగా తీసుకెళ్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులు మినహా మిగిలిన వారందరూ జలాశయాల్లోని మట్టిని తీసుకెళ్లాలంటే విధిగా ఆయా నీటి పారుదల, రెవెన్యూ, గనుల శాఖాధికారుల నుంచి పక్కాగా అనుమతులు తీసుకుని సీనరేజీ రుసుములు చెల్లించాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీ పరిధిలో ఉంటే సదరు సర్పంచి, కార్యదర్శుల అనుమతులు తీసుకుని పంచాయతీ బ్యాంకు ఖాతాకు విధిగా రుసుములు కట్టాల్సి ఉంటుంది. ఇవేవీ పట్టించుకోకుండా బహిరంగంగానే తమ బట్టీల్లో బంకమట్టి నిల్వలను టన్నుల కొద్దీ నిల్వ చేసుకున్నట్లు కనిపిస్తున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**అధికారులకు షరా 'మామూళ్లే'!** నియోజకవర్గాల పరిధిలోని పలు చెరువుల్లో అనుమతులు లేకుండా భారీ యంత్రాలు ఏర్పాటు చేసి మట్టి నిల్వలను యథేచ్ఛగా కొల్లగొడుతున్నారు.

అర్ధరాత్రి వేళ నెంబర్ ప్లేట్లు లేని ట్రాక్టర్లు, టిప్పర్లలో వేలాది మెట్రిక్ టన్నుల మట్టిని తరలిస్తున్నారు. స్థానికంగా బందోబస్తు పర్యవేక్షించే పోలీసులు, అనుమతులు ఇచ్చే నీటి పారుదల, రెవెన్యూ, గనుల అధికారులు పట్టించుకోవడం లేదు. ఏ శాఖ వారిని అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని వివరణ అడిగితే మా పరిధిలోకి రాదని దాటేస్తున్నారు.

ఇటుక బట్టీల నిర్వాహకులు చేస్తున్న మట్టి అక్రమ రవాణాలో స్థానిక నాయకులతో పాటు అధికారులు, సిబ్బంది పాత్ర ఉండటంతో ఎవరికి వారు మిన్నకుండిపోతున్నారు. ఎవరైనా అడిగినా ప్రశ్నలు దాట వేస్తున్నారు. సహజ సిద్ధంగా ప్రకృతి ప్రసాదించిన చెరువు మట్టిని 'తలా పాపం తిలా పిడికెడు' అన్న చందంగా వ్యవహరిస్తూ సభ్య సమాజం నివ్వెరపోయేలా చేస్తున్నారు. వీరిని ఆయా జిల్లా కలెక్టర్లు గుర్తించి తక్షణమే అధికారులపై చర్యలు తీసుకుని మట్టి నిల్వలు తరలించి పోకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ముక్తకంఠంతో కోరుతున్నారు. నల్గొండ జిల్లాలో నాగార్జున సాగర్, నల్గొండ, హాలియా, మిర్యాలగూడ, నకిరేకల్, చందంపేట, దేవరకొండ, మునుగోడు, చిట్యాల, వేములపల్లి ప్రాంతాల్లో 350 వరకు ఇటుక బట్టీల పరిశ్రమలు ఉన్నాయి. సూర్యాపేట జిల్లాలో కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి ప్రాంతాల్లోనూ 300 వరకు ఇటుక బట్టీలు ఉన్నాయి.

# ఎట్టకేలకు.. ఏడేళ్లకు!



హైదరాబాద్: రెండూ బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయాలే... ఒకటేమో నెలల్లోనే సిద్ధమైతే.. మరొకటి ఏడేళ్లుగా కడుతూనే ఉన్నారు. బంజారాహిల్స్ కేబీఆర్ పార్క్ వద్ద ఇటీవల చేపట్టిన బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయం నెలల వ్యవధిలో పనులు పూర్తికాగా.. ట్రయల్ రన్ మొదలుపెట్టారు. మరోవైపు ఆరున్నరేళ్ల కిందట నాంపల్లిలో మొదలెట్టిన మొట్టమొదటి ఆటోమేటెడ్ బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయం పనులు ఇంకా కొనసాగుతున్నాయి. వచ్చే నెలలో ట్రయల్ రన్ ఉంటుందని మెట్రోరైలు అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది జనవరిలోనే నుమాయిష్ సమయానికి అందుబాటులోకి తీసుకురావాలని ప్రయత్నించినా.. జర్మనీ నుంచి పరికరాలు రాకపోవడంతో ఆలస్యమైందని ప్రాజెక్ట్‌ను పీపీపీలో చేపట్టిన సంస్థ చెబుతోంది. నాంపల్లి కూడలిలో హైదరాబాద్ మెట్రోరైలు లిమిటెడ్‌కు చెందిన అర ఎకరం భూమి కేటాయించగా.. ప్రైవేటు సంస్థ నిధులు వెచ్చించి నిర్మాణం చేపడతామని ముందుకొచ్చింది. 2018 సెప్టెంబరు 8న భూమిపూజ చేశారు. ఏడాదిలో పూర్తి కావాల్సిన పనులు కొవిడ్, రుణ లభ్యత సమస్యలు, ప్రపంచవ్యాప్తంగా సరఫరా గొలుసు అవాంతరాల వంటి కారణంగా సుదీర్ఘంగా కొనసాగుతున్నాయి. ఎట్టకేలకు ఇప్పుడు పనులు పూర్తిచేసి తుది మెరుగులు దిద్దుతున్నారు. ఈ నెలాఖరుకల్లా పూర్తవుతుందని అధికారులు తెలిపారు.

**ఇదీ తేడా..** కేబీఆర్ పార్క్ వద్ద బహుళ అంతస్తుల పార్కింగ్ వ్యవస్థను జీహెచ్ఎంసీ చేపట్టింది. ఇది సాధారణమైన మెకానికల్ పార్కింగ్ వ్యవస్థ. హైదరాబాద్‌లో మొట్టమొదటిది. పీపీపీలో చేపట్టారు. ప్రీకాస్టింగ్ విధానంలో చేపట్టారు. కార్లు, ద్విచక్రవాహనాలు నిలపవచ్చు. నాంపల్లిలో నిర్మించేది పూర్తిగా ఆటోమేటెడ్ పార్కింగ్ వ్యవస్థ. దేశంలోనే మొట్టమొదటిది. మూడు బేస్‌మెంట్లు, ఏడు అంతస్తుల్లో 250 కార్లు ఆటోమెటిక్‌గా, 100 బైకులు మాన్యువల్‌గా నిలపవచ్చు. 15 అంతస్తుల భవనం(3 బేస్‌మెంట్లు) భవనంలోని కింది అంతస్తులో వాహనాలు నిలిపేందుకు నాలుగు టెర్మినల్స్ ఏర్పాటుచేశారు. ఇక్కడినుంచి ట్రాన్స్‌పోర్టర్ షటిల్ వాహనాన్ని నిర్ణీత అంతస్తుకు తీసుకెళ్లి పార్క్ చేస్తుంది.

# సర్కారు భూముల పరిరక్షణకు ఈ-కోర్టు పోర్టల్



హైదరాబాద్: తప్పుడు పత్రాలతో ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న వారికి చెక్ పెట్టేందుకు రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారులు వినూత్న పద్ధతిని అమలు చేస్తున్నారు. పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టం (అర్బన్ ల్యాండ్ సీలింగ్) పరిధిలోని ప్రభుత్వ భూములను నిర్ధారించేందుకు 'ఈ-కోర్టు-యూఎల్‌సీ ఆర్ఆర్' పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. గరిష్ఠ పరిమితి నుంచి మినహాయింపు ఉందని న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్న వ్యక్తులు, సంస్థలు దాఖలు చేసిన ఫిర్యాదులు తప్పని రుజువు చేసేందుకు ఈ-కోర్టు పోర్టల్ ద్వారా ట్రైబ్యునల్ కోర్టులు, హైకోర్టులకు సమాధానాలు ఇవ్వనున్నారు. శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, రాజేంద్రనగర్, ఎల్బీనగర్, శంషాబాద్, మొయినాబాద్, చేవెళ్ల, మహేశ్వరం వంటి ప్రాంతాల్లో పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టంలో భాగంగా 9 వేల ఎకరాలకుపైగా ఇప్పటికీ ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ఎకరా రూ.25 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకూ పలుకుతుండడంతో వాటిని దక్కించుకునేందుకు కొందరు తప్పుడు పత్రాలు సృష్టించి కోర్టులను ఆశ్రయిస్తున్నారు. అవి నకిలీవని తెలిపే ఆధారాలను అధికారులు కోర్టులకు సమర్పించనున్నారు.


**సమగ్ర వివరాలు కంప్యూటరీకరణ**

ఈ చట్టం ప్రకారం భూముల సమగ్ర వివరాలను జియోట్యాగింగ్ ద్వారా రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ ద్వారా కంప్యూటరీకరించారు. గ్రామం, మండలం సర్వేనంబర్లు అన్నింటిని పొందుపరిచారు. ఆయా సర్వేనంబర్లలో భూములు ప్రభుత్వం ఆధీనంలో ఉన్నాయా? ఎవరైనా కోర్టుల్లో ఫిర్యాదు చేశారా? ప్రభుత్వం తరపున ఫిర్యాదులకు వ్యతిరేకంగా వాదనలు వినిపించారా? తదుపరి విచారణ తేదీలు ఎప్పుడున్నాయి? అన్న వివరాలు ఈ పోర్టల్‌లో ఉన్నాయి. సర్వే నంబర్, విచారణ తేదీలు కంప్యూటర్‌లో నమోదు చేస్తే... ఒక్క క్లిక్‌తో వివరాలన్నీ ప్రత్యక్షమవుతాయి. వీటిని ఏకకాలంలో తహసీల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్, జిల్లా కలెక్టర్‌లు చూసేందుకు వీలుంటుంది.

**అవన్నీ ప్రభుత్వానివే** సి.నారాయణరెడ్డి, కలెక్టర్, రంగారెడ్డి జిల్లా

గతంలో న్యాయస్థానాల్లోని ఫిర్యాదులు, విచారణల సందర్భంగా రికార్డులను సరిచూసుకునే వాళ్లం. కొత్త విధానంలో భూముల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఉంటాయి. ప్రస్తుతం 840 ఎకరాలపై కోర్టుల్లో వివాదాలు కొనసాగుతున్నాయి. ఇవన్నీ ప్రభుత్వానివే. ప్రైవేటు వ్యక్తులు సమర్పించిన పత్రాలు సరైనవి కావు. రికార్డులను కోర్టులకు సమర్పించనున్నాం.

# నిధులకు.. నిబంధనలే అడ్డంకి



మెట్‌పల్లి : ఏళ్లు గడుస్తున్నా మొండి గోడలే దిక్కవుతున్నాయి. పాలకుల పట్టింపులేనితనంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. వసతుల్లేక విద్యార్థులు, అధ్యాపకులు విలవిలలాడుతున్నారు. గదుల గోడలకు ప్లాస్టరింగ్, నేలపై ఫ్లోరింగ్ లేదు. కిటికీలకు, గదులకు తలుపులు, వెంటిలేటర్లు అసలే లేవు. కనీసం ఆర్‌యుఎస్ఏ, యూజీసీ నిధులు మంజూరవుతాయనుకుంటే కళాశాల పేరిట స్థలం లేక ఒక్క రూపాయి వచ్చే అవకాశం లేకుండా పోయింది. ఇది మెట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెలకొన్న పరిస్థితి. మెట్‌పల్లి పట్టణంలో 2008-09 సంవత్సరంలో డిగ్రీ కళాశాల మంజూరవడంతో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనంలో షిఫ్టు పద్ధతిలో కొనసాగించారు. డిగ్రీ తరగతులను మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్న క్రమంలో విద్యార్థులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని పట్టణ పరిధిలోని వెంకట్రావుపేటలో గతంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం నిర్మించి అసంపూర్తిగా, వృథాగా ఉన్న భవనంలోకి 2016లో మార్చారు. భవనంలో వసతుల కల్పనకు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవిస్తున్నా కార్యరూపం దాల్చడం లేదు.

**అసలు సమస్య అక్కడే..!**

వెంకట్రావుపేటలో కుంటకు ఆయకట్టు లేకపోవడంతో ఆ స్థలంలో 1996-97లో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం నిర్మించి ప్రస్తుతం డిగ్రీ కళాశాల కొనసాగిస్తున్నారు. శిఖం భూమిని అయాన్(ఆయకట్టు లేకపోవడంతో ఇతర అవసరాలకు వాడేందుకు ప్రభుత్వ స్థలంగా గుర్తింపు)గా మార్చేందుకు ప్రయత్నించినా సాధ్యపడలేదు. ఆ ప్రక్రియ పూర్తికాక కళాశాలకు ఎలాంటి నిధులు మంజూరవ్వడం లేదు. కళాశాల పేరిట స్థలం ఉంటే రాష్ట్రీయ ఉచ్చతార్ శిక్షా అభియాన్(ఆర్‌యుఎస్ఏ), యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ)) నుంచి నిధులు మంజూరయ్యే అవకాశముండేది. ఇటు ఆర్‌యుఎస్ఏ, యూజీసీ నిధులు, అటు ప్రభుత్వ నిధులు రాక డిగ్రీ విద్యార్థుల కష్టాలు తీరడం లేదు. కళాశాల మంజూరై సుమారు పదిహేడేళ్లు దాటినా ప్రభుత్వ స్థలం కేటాయించకపోవడం, సొంత భవనం నిర్మించకపోవడం పాలకులకున్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందని విద్యార్థులు, విద్యావేత్తలు వాపోతున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఈ కళాశాల తర్వాత మంజూరైన వాటికి సొంత భవనాలు సమకూరాయని, ఇక్కడ మాత్రం పట్టించుకునే వారే కరవయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వానికి ప్రతిపాదనలు**

కళాశాల ప్రారంభంలో విద్యార్థులు తగిన సంఖ్యలో ఉన్న సదుపాయాల్లేక రానురాను సంఖ్య తగ్గుతూ వస్తోంది. బీఎస్సీ, బీజెడ్‌సీల్లో విద్యార్థులు తక్కువ సంఖ్యలో ఉండడంతో కోర్సులను తొలగించారు. ప్రస్తుతం బీఏ ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో, బీకాం ఆంగ్ల మాధ్యమ కోర్సులున్నాయి. ఇక్కడి విద్యార్థులు వ్యాసరచన, జిజ్ఞాస వంటి పోటీల్లో ప్రతిభ కనబర్చారు. కళాశాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో వర్షం కురిసిన సమయంలో ఆవరణంతా కుంటలాగా తయారవుతోంది. ఆరు కొత్త గదులు నిర్మించడంతో పాటు నాలుగు పాత గదుల్లో ప్లాస్టరింగ్, తలుపుల ఏర్పాటు, ప్రహరీ, నీరు బయటకు వెళ్లేలా కాలువ తదితర పనులకు ప్రస్తుతానికి రూ.53.20 లక్షలతో అంచనా తయారు చేసి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులకు విన్నవించారు. నిధులు మంజూరు చేసి వసతులు మెరుగుపర్చాలని విద్యార్థులు కోరుతున్నారు.

# 'వెరీ'గుడ్డు బిర్యానీ

వీర్నపల్లి : పౌష్టికాహార లోపాన్ని నివారించి చిన్నారుల ప్రవేశాల పెంపు లక్ష్యంగా ఐసీడీఎస్ వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు కోడిగుడ్డు బిర్యానీ వడ్డించాలని భావిస్తోంది. పూర్తి స్థాయిలో అమలైతే జిల్లాలోని వేలమంది పిల్లలకు ప్రయోజనం చేకూరనుంది.

**చిన్నారులకు ప్రాధాన్యం** జిల్లాలో వేములవాడ, సిరిసిల్ల ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 587 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. రెండున్నర సంవత్సరాల నుంచి అయిదేళ్లలోపు పిల్లలు 20 వేల మంది ఉన్నారు కానీ.. కేంద్రాల్లో సుమారుగా పదివేల మంది మాత్రమే నమోదయ్యారు. అంగన్‌వాడీ బాటతో ప్రవేశాల పెంపునకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. అయిదు వేల మంది చిన్నారులను అంగన్‌వాడీల్లో నమోదు చేయించడమే లక్ష్యంగా పని చేస్తున్నారు. హాజరయ్యే చిన్నారుల సంక్షేమానికి సర్కారు సైతం ప్రాధాన్యం కల్పిస్తోంది.కొంత ఆలస్యంగా.. కేంద్రాల్లోని పిల్లలతోపాటు గర్భిణులు, బాలింతలకు ఇప్పటికే ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఒక పూట కోడిగుడ్డుతో కూడిన భోజనాన్ని పెడుతున్నారు. మూడేళ్లలోపు పిల్లలకు బాలామృతంతోపాటు 16 గుడ్లు ఇస్తున్నారు. పప్పుతో కూడిన ఆహారం రోజు తినేందుకు పిల్లలు అంతగా ఇష్టపడటం లేదు. తల్లిదండ్రులు సైతం అంగన్‌వాడీలకు పంపేందుకు



ఆసక్తి చూపడం లేదు. దీంతో కేంద్రాలపై సర్కారు ప్రత్యేక దృష్టి సారించింది. పలు సంస్కరణలు చేపడుతూనే పిల్లల సంక్షేమానికి కృషి చేస్తోంది.ఇటీవల కోడిగుడ్డు బిర్యానీ అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నెల 11నే పిల్లలకు ఎగ్ బిర్యానీ వడ్డించాలి కానీ.. వరుస సెలవుల కారణంగా కేంద్రాలకు గుడ్ల సరఫరాలో కొంత ఆలస్యంతో చాలా కేంద్రాల్లో తయారీ చేయలేదు. నాలుగు రోజుల క్రితమే కోటా వారీగా గుడ్లు సరఫరా అయ్యాయి.

ప్రతీ బుధవారం కోడిగుడ్డు బిర్యానీ అందించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు వారంలో రెండు రోజులు అందిస్తారనే ప్రచారమూ జరుగుతోంది. ప్రస్తుతం వండేందుకు అవసరమైన సరకులు ఉపాధ్యాయినులు కొనుగోలు చేస్తున్నారు. భవిష్యత్తులో ఎగ్‌బిర్యానీ అందించేందుకు ఖర్చులపై అంచనా వేయనున్నారు.

**పౌష్టికాహారం పంపిణీకి చర్యలు**

అంగన్‌వాడీల్లో చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం పంపిణీకి తగు చర్యలు తీసుకుంటున్నాం. ప్రవేశాల పెంపునకు కృషి చేస్తున్నాం. కోడిగుడ్డు బిర్యానీ అందించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. అందుకు సంబంధించి పూర్తి ఏర్పాట్లు చేశాం. గుడ్ల సరఫరాలో కొంత ఆలస్యం కారణంగా కొన్ని కేంద్రాల్లో గత వారంలో ప్రారంభించలేదు. కొనసాగింపుపై పూర్తి స్థాయి మార్గదర్శకాలు రావాల్సి ఉంది.

లక్ష్మీరాజం, జిల్లా సంక్షేమాధికారి

# తాగే నీరు సురక్షితమేనా!

నల్గొండ : ఏటా వర్షాకాలం వస్తూ.. వెంట అంటువ్యాధులు, రోగాలను తీసుకురావడం సాధారణమైపోయింది. కలుషిత నీరు వర్షాకాలం నేపథ్యంలో అందరూ తాగునీటి వనరుల నాణ్యతపై దృష్టి సారించాలి. ప్రస్తుతం జిల్లాలో మిషన్ భగీరథ పథకంతో పాటు స్థానిక సంస్థల ద్వారా చాలా గ్రామాల్లో తాగునీరు సరఫరా చేస్తున్నారు. వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం శరవేగంగా సమాయత్తం కావాల్సి ఉంది. జలాశయాలు, ట్యాంకులు, నల్లాల వద్ద నీటి నమూనాలను సేకరించి తప్పనిసరిగా పరీక్షలు చేయాలి. నాణ్యత లోపించినట్లు నిర్ధారణ అయితే వెంటనే చర్యలు తీసుకోవాలి.

**ప్రజా కుళాయిలు** గ్రామాల నుంచి నగరాల వరకు అనేక చోట్ల ప్రజల కోసం ఏర్పాటు చేసిన ప్రజా కుళాయిలను గాలికి వదిలేస్తున్నారు. నీటి నాణ్యత, పర్యవేక్షణ విషయాన్ని అధికారులు పూర్తిగా మరిచారు. మురికి వాడలు, గ్రామాల్లో ట్యాంకులు గల ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నాయి. వీటి నుంచి సరఫరా అయ్యే నీటికి నాణ్యత పరీక్షలు చేయడం లేదు. ముఖ్యంగా పాఠశాలల కుళాయిల్లో నీటిని పరీక్షించాలనే బాధ్యత అందరూ విస్మరించారు.

**లీకేజీ సమస్యలు** నిర్లక్ష్య ధోరణితో కొన్ని ప్రాంతాల్లో నాసిరకమైన సామగ్రితో పైపులైన్లు వేసి పూడ్చడంతో లీకేజీలు జరిగి నీరు కలుషితమవుతోంది. అధికలోతులో డ్రైనేజీల లోపల వేసిన పైపులు లీకేజీలకి గురైతే గుర్తించే అవకాశం ఉండదు. అటువంటి సందర్భాల్లో ఆ పైపుల నుంచి సరఫరా అయ్యే నీటిని తాగితే రోగాలకు ఆహ్వానం పలికినట్లే. వర్షాకాలం కలుషితమయ్యే నీటి వల్లే డయేరియా, టైఫాయిడ్, కామెర్లు, రకరకాల జ్వరాలు, వాంతులు, విరేచనాలు వస్తుంటాయి.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

గ్రామ పంచాయతీ సంబంధిత సిబ్బందితో ఏటా నాణ్యత నిర్ధారణ పరీక్షలు చేయాలిగ్రామీణ ప్రాంతాల్లో మిషన్ భగీరథ అధికారులు పరీక్షలు నిర్వహించాలి

నీటి ట్యాంకులను తరచు శుభ్రం చేయాలి.

ఫిల్టర్ బెడ్‌లు, గృహాల వద్ద ఉండే నల్లాల నుంచి నమూనాలు సేకరించాలి.

లీకేజీ సమస్యలు ఉంటే మరమ్మతు చర్యలు తీసుకోవాలి.

వర్షాకాలమంతా ప్రతిరోజు క్లోరిన్ టెస్టు కిట్ల ద్వారా నాణ్యత స్థాయిని పరిశీలిస్తూ ఉండాలి.

జిల్లాలో గ్రామ పంచాయితీలు : 868

మిషన్ భగీరథ నీరు సరఫరా చేస్తున్న గ్రామాలు : 1775

ఇంటింటి కుళాయి కనెక్షన్లు: 3,70,092

స్థానిక నీటి వనరులు(బోర్లు): 5,325

**నీటి కలుషిత నివారణకు చర్యలు**

వెంకయ్య, జిల్లా పంచాయతీ అధికారి

వర్షాకాలంలో గ్రామాల్లో నీటి కలుషిత నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రణాళిక రూపొందించి స్థానిక నీటి వనరుల నీటిని పరీక్షలు చేయడం, ట్యాంకులను శుభ్రం చేయించడం, ట్యాంకుల్లో నీటిని క్లోరినేషన్ చేయడం వంటి ప్రక్రియ చేపట్టనున్నాం. అన్ని పంచాయతీల్లో బ్లీచింగ్, ఇతర రసాయనాలను సిద్ధంగా ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఎక్కడైనా పైపులైన్లు లీకేజీలు అయిన వెంటనే గ్రామపంచాయతీ, మిషన్ భగీరథ సిబ్బంది సమన్వయంతో మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకుంటాము.




నందికొట్కూరు: రాయలసీమలో అరాచకం సృష్టించాలని మాజీ సీఎం జగన్ చూస్తున్నారని ఏపీ ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. మన జీవితాల్లో వెలుగులు నింపేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు.

బనకచర్లపై జగన్ మాటలను చరిత్ర క్షమించదన్నారు. నంద్యాల జిల్లా మల్యాల పంపింగ్ స్టేషన్ వద్ద హంద్రీనీవా కాల్వకు సీఎం చంద్రబాబు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పయ్యావుల మాట్లాడారు. " కేవలం 100 రోజుల్లోనే హంద్రీనీవా కాల్వ సామర్థ్యాన్ని 12 పంపులకు పెంచాం. వైకాపా హయాంలో గంప మట్టి కూడా తీయలేని పరిస్థితి నెలకొంది. జగన్ మళ్లీ పాలెగాళ్ల సంస్కృతిని ప్రోత్సహిస్తున్నారు. రాయలసీమను అభివృద్ధి చేసింది మా పార్టీయే. మీ వైపు ఎంతమంది మారినా.. మా వైపు ఒకే నాయకుడు ఉన్నారు. వైకాపా నేతలు రౌడీ రాజకీయాలు చేస్తున్నారు" అని పయ్యావుల కేశవ్ విమర్శించారు.

## జగన్ నేరపూరిత వ్యాఖ్యలను ప్రజలు క్షమించరు: యనమల

తుని: ప్రజాస్వామ్య వ్యవస్థలో మాజీ సీఎం జగన్ వైఖరి దారుణంగా ఉందని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. రాష్ట్రాన్ని ఇంకా ధ్వంసం చేస్తాననేలా ఆయన తీరు ఉందని విమర్శించారు. జగన్ చేసే నేరపూరిత వ్యాఖ్యలు.. కక్ష తీర్చుకునే స్వభావాన్ని ప్రజలు క్షమించరన్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్లు చేసిన ధ్వంసం.. మళ్లీ చేస్తానంటే స్వాగతించేందుకు ప్రజలు సిద్ధంగా లేరని చెప్పారు. రాయలసీమలో ఫ్యాక్షనిజంతో నష్టపోయిన కుటుంబాలను మంత్రి నారా లోకేశ్ ఉండవల్లి నివాసానికి పిలిపించుకుని మాట్లాడారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా ధర్మవరం నియోజకవర్గం కామిరెడ్డిపల్లికి చెందిన బోయ నరసింహులు తెదేపాలో మొదటి నుంచి క్రియాశీలకంగా పని చేసేవారు. ప్రత్యర్థులు దారి కాచి 2011లో నరసింహులు సహా అతడి కుమారుడు, కుమార్తెను దారుణంగా హత్య చేయడం సంచలనం



సృష్టించింది. ఫ్యాక్షన్ బారినపడి బోయ నరసింహులు కుటుంబం ఎంతో నష్టపోయింది. పార్టీ అధినేత చంద్రబాబు ఆ కుటుంబానికి అండగా నిలిచారు. ఇప్పుడు వారిని ఉండవల్లి నివాసానికి ఆహ్వానించిన లోకేశ్.. అన్ని విధాల అండగా ఉంటానని హామీ ఇచ్చారు.




బలోచ్ లిబరేషన్ ఆర్మీ పాకిస్థాన్ సైన్యానికి ఊపిరి ఆడనివ్వడం లేదు. గత రెండ్రోజుల్లో 27 మంది పాక్ సైనికులను మట్టుపెట్టినట్లు ఆ సంస్థ ప్రకటించింది. ఈ విషయాన్ని ఆ సంస్థ ఓ సోషల్ మీడియా పోస్టులో వెల్లడించింది. బీఎల్ఏకు చెందిన ఫతే స్క్వాడ్ కలాత్‌లోని నిమ్రాగ్ క్రాస్ వద్ద సైనికులను తరలిస్తున్న ఓ బస్సును లక్ష్యంగా చేసుకొని దాడి చేసింది.

ఇందులో 27 మంది సైనికులు చనిపోగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ బస్సు కరాచీ నుంచి క్వెట్టాకు దళాలను తరలిస్తుండగా ఈ దాడి చోటుచేసుకొంది. మరో ఘటనలో క్వెట్టాలోని హజార్‌గంజ్‌లో ఐఈడీ పేల్చి మరో ఇద్దరు సైనికులను హతమార్చినట్లు బీఎల్ఏ వెల్లడించింది. మంగళవారం కలాత్‌లోని ఖజినా ప్రాంతంలో మరో ఐఈడీ పేల్చి నలుగురు సైనికులను , బుధవారం గుర్జోకొర్ ఏరియాలో దాడి చేసి మరో ఆరుగురు సైనికులను హత్య చేసినట్లు బీఎల్ఏ ప్రకటించింది. వీరిలో మేజర్ సయిద్ రబ్ నవాజ్ తరీక్ కూడా ఉన్నట్లు చెప్పింది. సమీపంలోని సైనిక కాన్వాయ్‌ను స్నైపర్లు లక్ష్యంగా చేసుకోవడంతో.. ఆ కాన్వాయ్ అక్కడినుంచి వెళ్లిపోయింది. ఇక ముగ్గురు బీఎల్ఏ దళ సభ్యులు చనిపోయినట్లు వచ్చిన వార్తలను ఖండించింది. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ బలోచ్ రెబల్స్ మొత్తం 286 దాడులు చేశారు. ఈ క్రమంలో వివిధరకాల వ్యూహాలను అమల్లోకి తెచ్చారు. వీటిల్లో మూడు ఆత్మాహుతి దాడులు ఉన్నాయి. బీఎల్ఏ చేసిన మొత్తం దాడుల్లో 700 మందికి పైగా చనిపోయారు. 290 మందిని అదుపులోకి తీసుకొన్నట్లు బీఎల్ఏ చెబుతోంది. ఈ క్రమంలో 133 వాహనాలను లక్ష్యంగా చేసుకొంది.

ఏకంగా ఓ రైలునే హైజాక్ చేసింది. దీంతోపాటు ఈ ఏడాది మొత్తం 45 వ్యూహాత్మక ప్రాంతాలను పాక్ నుంచి స్వాధీనం చేసుకొన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.




మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరం పరిశుభ్రతలో మరోసారి సత్తా చాటింది. దేశంలోనే అత్యంత పరిశుభ్ర నగరాల జాబితాలో తొలిస్థానం దక్కించుకొంది. 2024-25 సంవత్సరానికి గానూ ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో వరుసగా ఎనిమిదో సారి కైవసం చేసుకుంది. గుజరాత్‌లోని సూరత్ రెండో స్థానాన్ని దక్కించుకుంది. గత ఏడాది ఇండోర్‌తో పాటు సూరత్ కూడా సంయుక్తంగా తొలి ర్యాంక్‌లో నిలిచిన సంగతి తెలిసిందే. మూడో స్థానంలో నవీ ముంబయి నిలిచింది. ఇక, ఈసారి తెలుగు రాష్ట్రాల నుంచి విజయవాడ సత్తా చాటింది. ఈ జాబితాలో నాలుగో స్థానాన్ని కైవసం చేసుకుంది. 3-10 లక్షల జనాభా జాబితాలో నోయిడా నగరం తొలి స్థానంలో ఉంది. చండీగఢ్, మైసూర్ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. దిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీముర్ము గురువారం స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ మిషన్ కింద 4,500 నగరాలను పరిశీలిస్తారు. పారిశుద్ధ్యం, చెత్త నిర్వహణ, సేవల అందుబాటు వంటి పలు కొలమానాలను పరిగణనలోకి తీసుకుంటారు.

**ఏపీకి 5 అవార్డులు..** స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఐదు అవార్డులకు ఆంధ్రప్రదేశ్‌లోని 5 నగరాలు ఎంపికయ్యాయి. గ్రేటర్ వైజాగ్ మున్సిపల్ కార్పొరేషన్, విజయవాడ, రాజమహేంద్రవరం, గుంటూరు, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్లకు అవార్డులు దక్కాయి. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి సూపర్ స్వచ్ఛ లీగ్ అవార్డుల్లో 10 లక్షల కంటే ఎక్కువ జనాభా కేటగిరీలో విజయవాడ, 3-10 లక్షల్లోపు కేటగిరీలో గుంటూరు, 50వేల నుంచి లక్ష లోపు జనాభా కేటగిరీలో తిరుపతి నగరపాలక సంస్థలు అవార్డులకు ఎంపికయ్యాయి. కార్పొరేషన్ల కమిషనర్లతో కలిసి మంత్రి నారాయణ.. రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. కేంద్రమంత్రి మనోహర్‌లాల్, ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభితో పాటు ఆయా కార్పొరేషన్ల అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

**సికింద్రాబాద్ కంటోన్మెంట్ నంబర్ వన్..** క్లీనెస్ట్ కంటోన్మెంట్ బోర్డ్ కింద ఇచ్చిన అవార్డుల్లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ తొలిస్థానాన్ని సొంతం చేసుకుంది. 'వ్యర్థాల రహిత నగరం' కేటగిరీలో తెలంగాణ రాజధాని హైదరాబాద్ 7 స్టార్ రేటింగ్ సాధించింది. గతంలో 5 స్టార్ రేటింగ్ ఉండేది. ప్రామిసింగ్ స్వచ్ఛ షహర్ నగరాల జాబితాలో తెలంగాణ నుంచి హైదరాబాద్ చోటు దక్కించుకుంది.




పాకాల: తిరుపతి జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. గిరి అనే వ్యక్తి తన భార్య, ఇద్దరు పిల్లలను బావిలోకి తోసి చంపాడు. ఈ ఘటన పాకాల మండలం మద్దినాయినిపల్లెలో చోటుచేసుకుంది. భార్య హేమకుమారి (35), కుమార్తెలు తేజశ్రీ (7), తనుశ్రీ (11)ని చంపేసిన తర్వాత గిరి గొంతు కోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. కుటుంబ కలహాలతోనే గిరి ఈ ఘాతుకానికి పాల్పడినట్లు సీఐ సుదర్శన్ ప్రసాద్ తెలిపారు. గిరిని ఆస్పత్రికి తరలించడంతో అక్కడ చికిత్స పొందుతున్నాడు.




## అక్రమ మైనింగ్ కేసులో వల్లభనేని వంశీకి సుప్రీంకోర్టులో చుక్కెదురు

దిల్లీ: గన్నవరం వైకాపా నేత వల్లభనేని వంశీకి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ సతీష్‌చంద్ర శర్మ ధర్మాసనం అనుమతించింది. వంశీకి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఏపీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు ధర్మాసనం పక్కన పెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం వాదనలు వినకుండా ముందస్తు బెయిల్ ఇవ్వడాన్ని సర్వోన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. ఈ పిటిషన్‌పై తాజాగా విచారణ చేపట్టాలని ఆదేశించింది. కేసు మెరిట్స్‌లోకి, పీటీ వారెంట్స్‌లోకి వెళ్లడం లేదని స్పష్టం చేసింది. ఇరువురి వాదనలు విని మెరిట్స్ ఆధారంగా నిర్ణయం తీసుకోవాలని ధర్మాసనం ఆదేశించింది.

వారం రోజుల్లో కౌంటరు దాఖలు చేస్తామని ఏపీ ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ సుప్రీంకోర్టుకు తెలిపారు. ప్రభుత్వం కౌంటరు దాఖలు చేసిన నాలుగు వారాల్లో విచారణ ముగించి తీర్పు ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది.

## లోకేశ్‌పై మాట తూలితే తాట తీస్తాం: ఎమ్మెల్సీ భూమిరెడ్డి



అమరావతి: ఏపీ మంత్రి లోకేశ్‌పై అనవసరంగా మాట తూలితే తాట తీస్తామని వైకాపా నేతలను ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి హెచ్చరించారు. లోకేశ్ ప్రజల నుంచి వచ్చిన నాయకుడని, 2019-24 మధ్య కాలంలో ఆయన రాష్ట్ర ప్రజల మధ్యనే ఉన్నారన్నారు. లోకేశ్ రాజకీయానికి జగన్ విలవిల్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. జగన్ మతిభ్రమించి అధికారులను బెదిరిస్తున్నారని చురకలంటించారు. మరోవైపు జగన్ 'రప్పా రప్పా' డైలాగ్‌పై ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా స్పందించారు. రప్పా రప్పా నరుకుతాం అనేది దారితప్పిన వాళ్ల డైలాగ్ అని.. 'ప్రేమిస్తే పోయేదేమీ లేదు డ్యూడ్.. తిరిగి ప్రేమిస్తారు' ఇది రాష్ట్రాన్ని దారిలో పెట్టే డైలాగ్ అని పేర్కొన్నారు.




తిరుమల: రాయుడి హత్య విషయంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దేవుని సన్నిధిలో నిజం చెప్తున్నానని.. రాయుడు హత్య, వినుత విషయంలో తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. రాజకీయ కోణంలో తనపై వైకాపా తీవ్ర అభాండాలు వేస్తోందని తెలిపారు. దేవుడు, కుటుంబం సాక్షిగా రాయుడు హత్య విషయంలో తనకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. శ్రీకాళహస్తి మండలం బొక్కసంపాళానికి చెందిన శ్రీనివాసులు అలియాస్ రాయుడు ఇటీవల చెన్నైలో మృతి చెందాడు. శ్రీకాళహస్తి జనసేన ఇన్‌ఛార్జి కోట వినుత వద్ద అతను డ్రైవర్‌గా పనిచేసేవాడు. శ్రీనివాసులుది హత్యేనని అతని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. విచారణ కోసం చెన్నై పోలీసులు ఇటీవల శ్రీకాళహస్తికి వచ్చారు. ఈ కేసులో వినుతపై ఆరోపణలు రావడంతో పార్టీ నుంచి ఆమెను సస్పెండ్ చేసినట్టు జనసేన ప్రకటించింది.




## లారీని ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు.. ఒకరి మృతి

కోవూరు: నెల్లూరు జిల్లా కోవూరు మండల పరిధిలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బెంగళూరు నుంచి విజయవాడ వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ముందు వెళ్తున్న లారీని అతివేగంతో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాని అనే వ్యక్తి బస్సు క్యాబిన్లో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోవూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం.

## రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు అందుకున్న ఏపీ మంత్రి నారాయణ



దిల్లీ: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా ఏపీ మంత్రి నారాయణ స్వచ్ఛసర్వేక్షణ్ అవార్డులు అందుకున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఐదు అవార్డులకు రాష్ట్రంలోని 5 నగరాలు ఎంపికయ్యాయి. జీవీఎంసీ, విజయవాడ, రాజమహేంద్రవరం, గుంటూరు, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్లకు అవార్డులు దక్కాయి. కార్పొరేషన్ల కమిషనర్లతో కలిసి మంత్రి నారాయణ.. రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. కేంద్రమంత్రి మనోహర్‌లాల్, ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభితో పాటు ఆయా కార్పొరేషన్ల అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అనసూయ.. నడముతో వయ్యారాల సెగ

అనసూయ భరద్వాజ్.. ఎలాంటి డ్రెస్ లో కనిపించినా కూడా తనదైన గ్లామర్ తో సరికొత్తగా కనిపిస్తూ ఉంటుంది. ఇటీవల షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో నాన్ స్టాప్ గా వైరల్ అవుతున్నాయి. పింక్ కలర్, మల్టీ కలర్ లెహంగా–చోళీ ధరించి అనసూయ చేసిన ఈ ఫొటో షూట్ ఫ్యాన్స్‌ని పూర్తిగా ఆకట్టుకుంటోంది. బోల్డ్ అటిట్యూడ్, క్యూట్ ఫేస్ ఎక్స్‌ప్రెషన్స్ అంతా కలసి ఈ ఫొటోలు స్పెషల్ గా నిలుస్తున్నాయి. రంగురంగుల దుస్తులు, పర్ఫెక్ట్ స్టైలింగ్ తో అనసూయ ఈ సారి మరీ అందంగా కనిపిస్తోంది. ఈ ఫోటోల్లో అనసూయ వేసిన మల్టీ కలర్ లెహంగా దుస్తులు అద్భుతంగా ఆకర్షిస్తు న్నాయి. పైన వేసిన చోళీ పైన చిన్న చిన్న అద్దాలు, కట్లు వేస్తూ డిజైన్ చేసిన పద్ధతి, చీరని ఎగుర వేసిన ఫోటో పాజ్ అంతా చూసేవారికి ఒక కళాత్మక దృశ్యం లా కనిపిస్తోంది. ఈ లుక్‌లో అనసూయ స్టైల్, కాన్ఫిడెన్స్ రెండూ స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఫ్యాన్స్ మాత్రం ఈ ఫోటోలు చూసి కామెంట్స్ వర్షం కురిపిస్తున్నారు. 'అనసూయ గారూ..



మీరు వెన్నెలకంటే అందంగా ఉన్నారు', 'ఒక్క చూపుతో గుండెల్లో తుఫాను' అంటూ ఫ్యాన్స్ రియాక్షన్లు వెల్లువెత్తుతున్నాయి. అనసూయ ఈ మధ్యకాలంలో తన లుక్‌లతో, ఫ్యాషన్ స్టేట్‌మెంట్స్‌తో ఎక్కువగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అవుతోంది. అనసూయ కెరీర్ విషయానికి వస్తే, యాంకరింగ్ నుంచి సినిమాల వరకు తనదైన గుర్తింపు తెచ్చుకుంది. 'జబర్దస్త్' షోతో స్టార్ యాంకర్‌గా గుర్తింపు తెచ్చుకున్న అనసూయ, ఆ తర్వాత 'క్షణం', 'రంగస్థలం', 'పుష్ప' వంటి బిగ్ స్క్రీన్ ప్రాజెక్టులలో తన నటనతో కితాబు అందుకుంది. పుష్ప సినిమాలోని దాక్షాయిణి పాత్ర అయితే ప్రత్యేకంగా గుర్తింపు తెచ్చిపెట్టింది. తాజాగా అనసూయ వెబ్ సిరీస్‌లలోనూ బిజీ అవుతోంది. అలాగే అనసూయ మరికొన్ని ప్రాజెక్ట్స్‌లో నటిస్తోంది. అలాగే ఒక నటిగా మాత్రమే కాకుండా యాంకర్, మోడల్, వెబ్ సిరీస్ ఆర్టిస్ట్ ఇలా విభిన్న వేదికల్లో తనదైన ముద్ర వేసుకుంటూ వెళ్తోంది.

# నటనారంగేట్రంపై సారా టెండూల్కర్ ట్విస్ట్

క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా టెండూల్కర్ బాలీవుడ్ ఆరంగేట్రం గురించి చాలా కాలంగా గుసగుసలు వినిపిస్తున్నాయి. సినీ సెలబ్రిటీలతో అత్యంత సన్నిహితంగా వ్యవహరించే సారా టెండూల్కర్ కథానాయికగా ఆరంగేట్రం చేసేందుకు సిద్ధంగా ఉందని కథనాలొచ్చాయి. కానీ దీనిపై సచిన్ కుటుంబం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. తాజాగా వోగ్ ఇండియాతో ప్రత్యేక సంభాషణలో సారా టెండూల్కర్ స్వయంగా తన తెరంగేట్రం గురించి ఫుల్ క్లారిటీ ఇచ్చేసింది. సారా తాజా ఇంటర్వ్యూలో తనను నటించాల్సిందిగా ఎవరైనా కోరితే దానిని తిరస్కరిస్తున్నానని సారా టెండూల్కర్ వెల్లడించింది. "నేను అంతర్ముఖురాలిని... కెమెరాలు నన్ను భయపెడుతున్నాయి" అని సారా వెల్లడించింది. ఆ వృత్తికి న్యాయం చేయలేనని భావిస్తున్నాను. నటన



నాకు సంతృప్తి కంటే ఎక్కువ ఆందోళనను ఇస్తుంది. అందుకే అవకాశాలు వచ్చినా తిరస్కరిస్తున్నాను.. అని తెలిపింది. తాను నటనలోకి రాలేనని సారా అధికారికంగా వెల్లడించింది. ఫ్యాషన్ షూట్‌లు, బ్రాండ్స్ ప్రచారాలలో దూకుడుగానే ఉన్న సారా నటనను కెరీర్ గా ఎంచుకునే ఆలోచనతో లేదని తన మాటల్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. తనకు ప్రజాదరణ, అసాధారణమైన బ్యాకింగ్ ఉన్నప్పటికీ తాను స్టార్‌డమ్‌ను ఆశించడం లేదని సారా స్పష్టంగా చెప్పింది. నేను ఫ్యాషన్, అందం, లైఫ్ స్టైల్ వంటి వృత్తులలో కూడా పని చేస్తాను. నేను ప్రామాణికమైనది అనిపించేటిని మాత్రమే తీసుకుంటాను.. ప్రతిదానికీ అవుననలేను! అని సారా అంది.

యూనివర్శిటీ ఆఫ్ కాలేజ్ లండన్ లో బయో మెడికల్ సైన్సెస్‌లో బ్యాచిలర్ అండ్ క్లినికల్ న్యూట్రిషన్, పబ్లిక్ హెల్త్‌లో మాస్టర్స్ డిగ్రీని పూర్తి చేసిన సారా వైద్యవృత్తిలో కౌన్సిలింగ్ కెరీర్ పైనా దృష్టి సారించనుంది. ఇప్పుడు సచిన్ టెండూల్కర్ ఫౌండేషన్‌లో డైరెక్టర్‌గా పనిచేస్తూ ఆరోగ్యం, పోషకాహారం వంటి అంశాలపై తనవంతు సేవాకార్యక్రమాల్లోను పాల్గొంటోంది.




# నెవ్వర్ బిఫోర్ అనేలా ఎన్టీఆర్ - త్రివిక్రమ్ కథ



ఇప్పుడు దర్శకులంతా మైథాలజికల్ సినిమాల పట్ల ఆసక్తి కనబరిచే ట్రెండ్ నడుస్తోంది. ముఖ్యంగా భారీ విజువల్స్, విభిన్నమైన కథలతో తెరకెక్కించడానికి చాలా మంది దర్శకులు ప్రయత్నిస్తున్నారు. అయితే, ఆ జాబితాలో త్రివిక్రమ్ శ్రీనివాస్ కూడా చేరనున్నారని సమాచారం. ఆయన చేసే సినిమాల్లో డైలాగ్స్ ఎంత పదునుగా ఉంటాయో అందరికీ తెలిసిందే. కానీ ఇప్పుడు ఆయన చేయబోయే సినిమా మాత్రం నెవ్వర్ బిఫోర్ అనేలా ఉండబోతుందట. ఇటీవల వెంకటేష్ హీరోగా ఓ కామెడీ ఎంటర్టైనర్ కి కథ రాసిన త్రివిక్రమ్, ఆ ప్రాజెక్ట్ షూటింగ్‌ను ఆగస్ట్‌లో స్టార్ట్ చేయబోతున్నారు. ఆ సినిమా మాత్రం 2026 సమ్మర్‌లో విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారట. ఇదిలా ఉండగా, నిజమైన సంచలనం మాత్రం ఎన్టీఆర్ సినిమా విషయంలోనే ఉందట. ఎందుకంటే ఇది త్రివిక్రమ్ కెరీర్‌లో తొలి మైథాలజికల్ సినిమా. త్రివిక్రమ్ ఎన్టీఆర్ కోసం గత ఏడాది నుంచే స్క్రిప్ట్ వర్క్ మొదలుపెట్టారు. పూర్తిగా దేవుళ్ళ నేపథ్యం ఉన్న చిత్రమని టాక్. ఇందులో ఎన్టీఆర్ పాత్రను శక్తిమంతంగా, ఆధ్యాత్మికంగా చూపించేందుకు త్రివిక్రమ్ భారీ హోంవర్క్ చేస్తున్నారు. సినిమా షూటింగ్ 2026 చివరలో ప్రారంభం కానుందట. అంటే అప్పటివరకు త్రివిక్రమ్‌కు పూర్తి ప్రీ ప్రొడక్షన్ టైమ్ లభిస్తోంది. కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్‌తో పాటు విజువల్ ఎఫెక్ట్స్ ఎలా ఉండాలి అనే దానిపైనే ప్రధాన ఫోకస్ పెట్టారు. ఇది సాధారణ సినిమా కాదని తెలిసిన త్రివిక్రమ్ టీమ్ ఇప్పటికే టాప్ వీఎఫ్ఎక్స్ టెక్నీషియన్లను సంప్రదించిందట. ప్రపంచ స్థాయి టెక్నాలజీని ఉపయోగించి గ్రాఫిక్స్‌ను అత్యుత్తమంగా చూపించేందుకు భారీ స్కెచ్ వేస్తున్నట్టు సమాచారం. ప్రాజెక్ట్‌కు సంబంధించిన మొత్తం ప్రీ వర్క్ పూర్తి అయ్యాకే షెడ్యూల్స్ ప్రారంభించాలన్నదే త్రివిక్రమ్ ఆలోచన. ఈ చిత్రాన్ని హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పాన్ ఇండియా స్థాయిలో నిర్మించనుంది. బడ్జెట్ పరంగా, టెక్నికల్‌గా త్రివిక్రమ్ కెరీర్‌లోనే అతిపెద్ద ప్రాజెక్ట్ ఇది. తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ భారీగా విడుదల చేయాలని భావిస్తున్నారు. ఇది త్రివిక్రమ్‌కు మాత్రమే కాకుండా ఎన్టీఆర్ కెరీర్‌లోనూ ఓ బిగ్ సినిమా అవుతుంది. మొత్తానికి త్రివిక్రమ్ స్క్రిప్ట్ పనిలో మునిగిపోయారు. ఇంతవరకూ చేసిన సినిమాలు చూసిన వారికి ఇది పూర్తిగా విభిన్నంగా ఉండబోతోంది. ఆయన మైథాలజీ మీద ఉన్న పట్టు స్క్రీన్ పై ఎలా కనబడుతుందో చూడాలి.

# ఆ సెంటిమెంట్‌ను కంటిన్యూ చేయాలని చూస్తోన్న రాజా సాబ్



టాలీవుడ్ లో రిలీజ్ డేట్ల సమస్య చాలా పెద్దదిగా మారిపోయింది. తెలుగు సినిమా స్థాయి ప్రపంచ స్థాయికి ఎదిగిన నేపథ్యంలో ప్రతీ సినిమానీ మేకర్స్ భారీ ఎత్తున తెరకెక్కిస్తున్నారు. దీంతో సినిమా నిర్మాణానికే చాలా టైమ్ పడుతుంది. ముందు ఒక డేట్ అనుకోవడం ఆ తర్వాత పర్ఫెక్షన్ విషయంలో వివిధ కారణాలతో లేటవడం, క్రమంగా సినిమా వాయిదా పడటం జరుగుతూ వస్తుంది. అలా వాయిదా పడ్డ సినిమాలు చాలానే ఉన్నాయి. మారుతి దర్శకత్వంలో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ చేస్తున్నది రాజా సాబ్ సినిమా అయితే ఇప్పటికే పలుమార్లు వాయిదా పడి డిసెంబర్ 5కు రిలీజ్ డేట్ ను ఫిక్స్ చేసుకుంది. వాస్తవానికి రాజా సాబ్ ఈ ఏడాది మొదట్లోనే రావాల్సింది. కానీ షూటింగ్ లేటవడంతో సినిమా వాయిదా పడి డిసెంబర్ 5న రానున్నట్టు మేకర్స్ ఫిక్స్ చేశారు.

అయితే ఇప్పుడు డిసెంబర్ 5 నుంచి కూడా ది రాజా సాబ్ వాయిదా పడుతుందని కొందరంటుండటంతో డార్లింగ్ ఫ్యాన్స్ కంగారు పడుతున్నారు. ఆల్రెడీ పలుమార్లు పోస్ట్‌పోన్ అయిన రాజా సాబ్ ఈసారైనా చెప్పిన డేట్ కు రావాలని ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు ప్రభాస్ ఫ్యాన్స్. అయితే రాజా సాబ్ డిసెంబర్ 5 వాయిదా గురించి ఎన్ని వార్తలొచ్చినా అవన్నీ పుకార్లేనని ఫిక్సైపోవచ్చు. ఎందుకంటే డిసెంబర్ 5ని మిస్ చేసుకుంటే రాజా సాబ్ కు ఉన్న ఆప్షన్ సంక్రాంతి. ఆల్రెడీ సంక్రాంతికి పలు సినిమాలు కర్చీఫ్ వేసుకుని కూర్చున్నాయి. సోలో రిలీజ్ డేట్ ను వదులుకుని సంక్రాంతికి రిలీజ్ డేట్ ను మార్చుకుని కావాలని పోటీగా వెళ్లేంత సాహసం రాజా సాబ్ టీమ్ చేయదు. పైగా పోటీకి వెళ్తే సినిమా ఎంత బ్లాక్ బస్టర్ అయినప్పటికీ ఓపెనింగ్స్ పై ఎఫెక్ట్ పడే అవకాశముంది. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజా సాబ్ డిసెంబర్ 5 రిలీజ్ నుంచి తప్పుకునే ఛాన్సే లేదు. పైగా డిసెంబర్ 5కు మంచి సెంటిమెంట్ కూడా ఉంది. గతంలో అదే రోజున వచ్చిన పుష్ప2, యానిమల్ సినిమాలు బాక్సాఫీస్ వద్ద చేసిన హంగామా మామూలుది కాదు. ఇప్పుడు రాజా సాబ్ కూడా అదే డేట్ లో వచ్చి ఆ సెంటిమెంట్ ను కంటిన్యూ చేయడంతో పాటూ సోలోగా బాక్సాఫీస్ ను దున్నేయాలని ప్లాన్ చేస్తున్నారట. అదే రోజున రణ్‌వీర్ సింగ్ ధురంధర్ రిలీజవుతున్నప్పటికీ ఆ పోటీని తట్టుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. కాబట్టి రాజా సాబ్ రిలీజ్ డేట్ విషయంలో ఫ్యాన్స్ టెన్షన్ పడాల్సిన పని అసలు లేదు.

# హిట్ పడినా పట్టించుకోరేం..?

సినీ బ్యాక్‌గ్రౌండ్ ఉన్నప్పటికీ సొంత టాలెంట్‌తోనే ఎదిగింది ఐశ్వర్య రాజేష్. తెలుగమ్మాయి కావడం, కలర్ తక్కువ ఉండటంతో కెరీర్ ఆరంభంలో చాలా స్రగ్గుల్స్ ఫేస్ చేసింది. సొంత ఇండస్ట్రీలో అవకాశాలు రాక కోలీవుడ్ బాట పట్టింది. గ్లామర్ షో కన్నా నటనకు ప్రయారిటీ ఉన్న పాత్రలను ఎంపిక చేసుకుంటూ తమిళనాట స్టార్ హీరోయిన్ గా ముద్ర వేయించుకుంది. అక్కడ సంపాదించుకున్న క్రేజ్ తోనే తెలుగు, మలయాళం భాషల్లోనూ అవకాశాలు అందిపుచ్చుకుంది. తెలుగులో ఐశ్వర్య తొలి చిత్రం ' కౌసల్య కృష్ణమూర్తి '. క్రికెట్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఆ తర్వాత తెలుగులో ' మిస్ మ్యాచ్ ', ' వరల్డ్ ఫేమస్ లవర్ ', ' టక్ జగదీష్ ', ' రిపబ్లిక్ ' వంటి సినిమాల్లో ఐశ్వర్య నటించింది. కానీ ఆయా చిత్రాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టడంతో ఐశ్వర్య రాజేష్ మళ్లీ పొరుగు భాషా చిత్రాలపైనే ఆధాపడింది. తమిళ్, మలయాళ భాషల్లో సినిమాలే కాకుండా ట్రెండ్ కు తగ్గట్లుగా వెబ్ సిరీస్‌లలో యాక్ట్ చేస్తూ దూసుకుపోతుంది. అలాంటి తరుణంలోనే టాలీవుడ్ నుంచి ఐశ్వర్యకు పిలుపొచ్చింది. విక్టరీ వెంకటేష్, అనిల్ రావిపూడి కాంబో మూవీ ' సంక్రాంతి వస్తున్నాం 'లో వన్ ఆఫ్ ది హీరోయిన్ గా చేసే అవకాశాన్ని అందుకుంది. 2025 సంక్రాంతి




కానుకగా విడుదలైన ఈ సినిమా ఎంతటి భారీ విజయాన్ని నమోదు చేసిందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. వరల్డ్ వైడ్ గా 300 కోట్ల రూపాయల గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించి వెంకటేష్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా రికార్డు సృష్టించింది. అటు పండుగ సమయంలో విడుదలై, సంక్రాంతి విన్నర్ గానూ నిలిచింది. ఈ ఫ్యామిలీ ఎంటర్టైనర్ లో వెంకీ భార్యగా భాగ్యం పాత్రలో ఐశ్వర్య అదరగొట్టేసింది. ఆమె ఎనర్జిటిక్ యాక్టింగ్, డైలాగ్ డెలివరీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకు న్నాయి. సంక్రాంతి వస్తున్నాం మూవీతో తెలుగులో ఐశ్వర్య ఓ బిగ్ హిట్ ను అందుకుంది. అయినప్పటికీ టాలీవుడ్ ఆమెను పట్టించుకో వడం లేదన్న వాదన వినిపిస్తోంది. ప్రస్తుతం ఐశ్వర్య రాజేష్ చేతిలో దాదాపు అర డజన్ కొత్త ప్రాజెక్ట్స్ ఉన్నాయి. కానీ, అందులో ఒక్క తెలుగు సినిమా కూడా లేకపోవడం గమనార్హం. కథల ఎంపికలో సెలక్టివ్ గా ఉండే ఐశ్వర్యకు టాలీవుడ్ లో అవకాశాలు రావడం లేదా? లేక వచ్చిన ఆఫర్లు నచ్చడం లేదా? అన్నది తెలియాల్సి ఉంది.

# నేనెప్పుడూ అలా అనుకోలేదు.. లైఫ్ లో ఇక చేయను!: సామ్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్ లో వచ్చిన పుష్ప మూవీ ఎలాంటి విజయం సాధించిందో అందరికీ తెలిసిందే. నార్త్ టు సౌత్ ఓ రేంజ్ లో వసూళ్లను రాబట్టింది. బన్నీ కెరీర్ గ్రాఫ్ నే మార్చేసింది. అయితే సినిమాలోని స్టార్ హీరోయిన్ సమంత చేసిన సాంగ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఊ అంటావా మావా.. ఊఊ అంటావా మావా అంటూ సామ్ చేసిన సాంగ్.. వేరే లెవెల్ లో హిట్ అయింది. ఇప్పటికీ ఆ సాంగ్ ఎవర్ గ్రీనే అని చెప్పాలి. అనేక చోట్ల ఆ పాట వినిపిస్తూనే ఉంటోంది. అంతలా ఊ అంటావా ఊఊ అంటావా సాంగ్ మెప్పించింది. ముఖ్యంగా సామ్ వేసిన స్టెప్పులు, ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్స్ నెవ్వర్ బిఫోర్. సోషల్ మీడియాలో ఆ సాంగ్ భారీ వ్యూస్ రాబట్టింది. అయితే సామ్ ఐటెమ్ సాంగ్ చేస్తుందనే ప్రకటన రాగానే.. ఓ రేంజ్ లో హైప్ క్రియేట్ అయ్యింది. ఆ తర్వాత సాంగ్ వచ్చాక అంతకుమించి హిట్ అయ్యింది. అదే సమయంలో సమంత ఐటెమ్ సాంగ్ చేయడం పట్ల కొందరు సినీ



ప్రియులు పెదవి విరిచారు. మరికొందరు మెచ్చుకున్నారు. ఇప్పుడు ఆ సాంగ్ పై ఓ ఇంటర్వ్యూలో భాగంగా మాట్లాడారు సమంత. ఊ అంటావా ఊఊ అంటావా సాంగ్ చేసే ఆఫర్ వచ్చినప్పుడు చాలామంది చేయొద్దని తనతో చెప్పారని తెలిపారు. అయితే తానెప్పుడూ ఒక హాలిట్ గర్ల్ గా అనుకోలేదని చెప్పారు. ఆ విధంగా తానెప్పుడూ అస్సలు ఊహించుకోలేదని సమంత పేర్కొన్నారు. కానీ ఆ సాంగ్ ఆఫర్ వచ్చినప్పుడు ఒక సవాలుగా తీసుకున్నానని, అలాగే పని చేశానని తెలిపారు సామ్. అయితే సెట్స్ లో అడుగు పెట్టినప్పుడు చాలా కంగారుపడ్డానని వెల్లడించారు. కానీ ధైర్యంగా సాంగ్ ను కంప్లీట్ చేసినట్లు తెలిపారు. మళ్లీ భవిష్యత్తులో అలాంటి పాటల్లో యాక్ట్ చేస్తాననుకోవడం లేదుని క్లారిటీ ఇచ్చారు. ఇక సాంగ్ విషయానికొస్తే.. ఆస్కార్ అవార్డు విన్నర్ చంద్రబోస్ లిరిక్స్ అందించారు. రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందించగా.. మంగ్లీ సిస్టర్, సింగర్ ఇంద్రావతి తన హస్కీ వాయిస్ తో ఆలపించారు. ఇప్పటి వరకు యూట్యూబ్ లో ఊ అంటావా.. ఊఊ అంటావా సాంగ్.. 47 కోట్లకు పైగా వ్యూస్ అందుకుని ఇంకా దూసుకుపోతుందని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు!



# హెచ్‌సీఏ అవకతవకలపై కొనసాగుతున్న సీఐడీ దర్యాప్తు

హైదరాబాద్: హెచ్‌సీఏ అవకతవకలపై సీఐడీ దర్యాప్తు కొనసాగుతోంది. ఐదుగురు నిందితులను ఆరో రోజుల పాటు సీఐడీ కస్టడీకి మల్కాజిగిరి కోర్టు అనుమతించింది. ఈక్రమంలో హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు, ట్రెజరర్ శ్రీనివాస్‌రావు, సీఈవో సునీల్, రాజేందర్ యాదవ్, కవితను సీఐడీ కస్టడీలోకి తీసుకోనుంది. నేటి నుంచి ఈ నెల 22 వరకు వారిని అధికారులు విచారించనున్నారు. నలుగురు నిందితులను చర్లపల్లి జైలు నుంచి, కవితను చంచల్‌గూడ జైలు నుంచి సీఐడీ కస్టడీకి తీసుకోనుంది. వీరిని విచారిస్తే హెచ్‌సీఏలో జరిగిన అవకతవకలకు సంబంధించి మరిన్ని వివరాలు వెలుగులోకి వస్తాయని అధికారులు భావిస్తున్నారు.

# కేసీఆర్ కుటుంబం కడుపునిండా విషం పెట్టుకుని మాట్లాడుతోంది: సీఎం రేవంత్

దిల్లీ: కేసీఆర్ కుటుంబం కడుపునిండా విషం పెట్టుకుని మాట్లాడుతోందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వానికి తగిన సూచనలు ఇవ్వాలని.. వాటిని స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.



దిల్లీలో రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు కోసం మహారాష్ట్రలో పర్యటిస్తానని సీఎం తెలిపారు. రెండున్నరేళ్లలో లక్ష ఉద్యోగాలు ఇచ్చితీరుతామన్నారు.

బతుకమ్మ చీరలు, కేసీఆర్ కిట్ తప్ప పాత పథకాలన్నీ అమల్లోనే ఉన్నాయని చెప్పారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖలు రాయడం కాదని.. ప్రణాళికతో ముందుకు రావాలని సూచించారు. ఆయనతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు రేవంత్ తెలిపారు.



# అప్పుడు క్రెడిట్ తీసుకోవాలని చూసి.. ఇప్పుడు కోహ్లీపై నిందలా..?

ఐపీఎల్ విజయోత్సవాల వేళ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటనపై కర్ణాటక ప్రభుత్వం విడుదల చేసిన నివేదిక కీలక విషయాలను వెల్లడించింది. దానిలో స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ పేరును ప్రస్తావించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వంపై భాజపా విమర్శలు గుప్పించింది. ఆర్సీబీ విజయానికి ప్రభుత్వం క్రెడిట్ తీసుకోవాలని చూసిందని, ఇప్పుడు ఫ్రాంచైజీని, కోహ్లీని నిందిస్తోందని దుయ్యబట్టింది. హైకోర్టు ఆదేశాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఈ నివేదికను బయటపెట్టింది. పోలీసుల నుంచి అనుమతులు తీసుకోకుండానే విధాన సౌధ నుంచి చిన్నస్వామి స్టేడియం వరకు జరిగే విజయోత్సవ ర్యాలీలో పాల్గొనాల్సిందిగా ప్రజలను ఆహ్వానిస్తూ ఆర్సీబీ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టింది. అభిమానులతో కలిసి ఈ విజయాన్ని సెలబ్రేట్ చేసుకోవాలనుకుంటున్నట్లు విరాట్ మాట్లాడిన వీడియో క్లిప్‌ను షేర్ చేసిందని ఆ రిపోర్ట్ పేర్కొంది. ఇవన్నీ చిన్నస్వామి స్టేడియానికి భారీగా ప్రజలు తరలి రావడానికి దోహదం చేశాయని వెల్లడించింది. ఎంట్రీపాస్‌లపై నెలకొన్న గందరగోళం.. చివరకు తొక్కిసలాటకు దారితీసిందని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తుందని ఈ నివేదికపై భాజపా ఆగ్రహం వ్యక్తంచేసింది. “ఆర్సీబీ ఒక్కటే ప్రజలను ఆహ్వానించలేదు. కాంగ్రెస్ కూడా వారిని ఆహ్వానించింది. నివేదిక ప్రకారం ఆర్సీబీది మాత్రమే తప్పు అయితే.. ప్రభుత్వం పోలీసు అధికారులను ఎందుకు సస్పెండ్ చేసినట్టు..? ఈవెంట్ నిర్వహిస్తామని ఆర్సీబీ నుంచి సమాచారం ఉంటే.. ప్రభుత్వం అనుమతి నిరాకరించిఉండాలి. ఆ విజయానికి క్రెడిట్ తీసుకోవడం కోసమే.. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రజలను ఆహ్వానించారు. ఇప్పుడు గొప్ప ఆటగాడు కోహ్లీ, ఆర్సీబీ మీద నిందలు వేయడం తప్పు” అని భాజపా నేత అరవింద్ బెల్లాడ్ విమర్శలు చేశారు. జూన్ 4న జరిగిన తొక్కిసలాట ఘటనలో 11 మంది మృతి చెందగా 53 మంది గాయపడ్డారు. దీనిపై తీవ్ర విమర్శలు వచ్చిన నేపథ్యంలో విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాన్ మైఖెల్ డి.కున్హా నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం జ్యుడీషియల్ కమిషన్ వేసింది. అది ఇటీవల నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది.

దానిని రహస్యంగా ఉంచాలని ప్రభుత్వం అభ్యర్థన చేయగా.. అందుకు కోర్టు తిరస్కరించడంతో ఈ రోజు బహిర్గతమైంది. అలాగే తొక్కిసలాట ఘటన తర్వాత విజయోత్సవాలను ఎందుకు నిలిపివేయలేదో ఆ నివేదికలో రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. అప్పటికే అక్కడ అభిమానులు గుమిగూడి ఉన్నారని, అకస్మాత్తుగా వాటిని నిలిపివేయడం వల్ల అభిమానుల్లో ఆగ్రహం వ్యక్తమై, హింసాత్మక పరిస్థితులకు దారితీయొచ్చని భావించామని తెలిపింది. ఈ ఘటనను దృష్టిపెట్టుకొని వేడుక సమయాన్ని తగ్గించామని వివరణ ఇచ్చింది.



# BRS నేతలు నా దారికి రావాల్సిందే

హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి నేతలు తన దారికి రావాల్సిందేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత అన్నారు. న్యాయ నిపుణులతో చర్చించిన తర్వాతే బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ నిర్ణయాన్ని సమర్థించినట్టు చెప్పారు.

బీసీ రిజర్వేషన్లపై రెండు బిల్లులు పెట్టాలని మొదట డిమాండ్ చేసింది కూడా తానేనని గుర్తుచేశారు.

తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై భారత రాష్ట్ర సమితి నేతలు స్పందించలేదని, అది వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని కవిత అన్నారు. **బనకచర్ల ప్రాజెక్టుపై జాగృతి పోరాడుతుంది..** “కేంద్ర జలశక్తిశాఖ మంత్రి .. ఇద్దరు ముఖ్యమంత్రులతో నిర్వహించిన సమావేశంలో పండగ వాతావరణం కనిపించింది. మొదట బనకచర్ల అంశంపైనే చర్చ జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్.. గోదావరి జలాలను అప్పజెప్పి వచ్చారు. జరుగుతున్న నష్టం ఏమిటి? సీఎం అనుసరిస్తున్న వైఖరి ఏమిటి?. టెలిమెట్రీల ఏర్పాటు అంశంలో విషయం లేదు.. కానీ, సీఎం దాన్ని తమ విజయంగా చెబుతున్నారు. బనకచర్ల వల్ల ఏపీకి కూడా లాభం లేదు, కుట్ర పూరితంగా కాంట్రాక్టర్ల కోసం చేపడుతున్న ప్రాజెక్టు అది. కాంగ్రెస్, భాజపా దారుణంగా మోసం చేస్తున్నాయి. బనకచర్లను తక్షణమే ఆపాలి.. లేదంటే జాగృతి న్యాయ పోరాటం చేస్తుంది. బీసీ రిజర్వేషన్లు, బనకచర్లపై అఖిలపక్షాన్ని సీఎం దిల్లీకి తీసుకెళ్లాలి” అని కవిత డిమాండ్ చేశారు.

# హెచ్‌సీఏలో అక్రమాల వెనుక కేటీఆర్, కవిత హస్తం: టీసీఏ

హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ హెచ్‌సీఏలో అక్రమాల వెనుక మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత హస్తముందని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) ఆరోపించింది. ఈ మేరకు సీఐడీ డీజీ చారుసిన్హాకు టీసీఏ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి గురువారెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో మరికొందరు అక్రమార్కులు కూడా ఉన్నారని.. వారిపైనా విచారణ జరిపించాలని కోరారు. జాన్ మనోజ్, విజయానంద్, పురుషోత్తం అగర్వాల్, సురేందర్ అగర్వాల్, వంకా ప్రతాప్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.





# నేడు, రేపు భారీ వర్షాలు

హైదరాబాద్: తెలంగాణలో శుక్రవారం, శనివారం భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇవాళ నల్గొండ, సూర్యాపేట నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో, శనివారం మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశముందని పేర్కొంది. పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ ప్రకటించింది.

# ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. పునరుత్పాదక ఇంధన కార్యక్రమాలకు తెలంగాణ ప్రభుత్వం సహకారం అందించాలని అందులో పేర్కొన్నారు. తెలంగాణలోని అధిక సౌర విద్యుదుత్పత్తి సామర్థ్యం గల జోన్‌లను గుర్తించి ఆయా ప్రాంతాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలన్నారు.



గ్రిడ్ స్టెబిలిటీ, ఎనర్జీ రిలయబిలిటీలను మరింత పెంచేలా అత్యాధునిక బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌ను అభివృద్ధి చేయాలని చెప్పారు. పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలు అధ్యయనం చేయాలని తెలిపారు. ప్రాజెక్టులకు భూసేకరణ, భూకేటాయింపు కోసం ప్రభుత్వ మద్దతు అవసరమని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# కార్యకర్తల అరెస్టులో పోలీసుల వైఖరిపై కేటీఆర్ ఆగ్రహం



హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి కార్యకర్తల అరెస్టులో పోలీసుల వైఖరిపై ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా డీజీపీని ఉద్దేశిస్తూ పోస్టు పెట్టారు. రాజకీయ బాసుల ఆదేశాల మేరకు అమాయకులను అక్రమ కేసుల్లో ఇరికించి, అరెస్టులు చేసి, జైళ్లకు పంపుతున్నారని ఆరోపించారు. పాలనా అతిక్రమణలు, భయానక పరిణామాలు ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వంలో ఎవరూ శాశ్వతంగా ఉండబోరని గుర్తుంచుకోవాలన్నారు. తమ రోజు వచ్చినప్పుడు ప్రతి చర్యను సమీక్షిస్తామని చెప్పారు. న్యాయ వ్యవస్థపై తమకు పూర్తి నమ్మకం ఉందని కేటీఆర్ పేర్కొన్నారు.

# కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి నాయకుల పోటాపోటీ సవాళ్లు.. వేల్పూర్‌లో ఉద్రిక్తత



వేల్పూర్: నిజామాబాద్ జిల్లా వేల్పూరులో ఉద్రిక్తత నెలకొంది. ఆరుగ్యారంటీలు ఇంకా లబ్ధిదారులకు అందట్లేదని భారత రాష్ట్ర సమితి నేతలు ఆరోపించారు. మరోవైపు లబ్ధిదారులను ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి నివాసానికి తీసుకొస్తామని కాంగ్రెస్ నేతలు సవాల్ విసిరారు. ఈక్రమంలో వేల్పూర్ వెళ్లేందుకు యత్నించిన కాంగ్రెస్ నేత మోహన్‌రెడ్డిని పోలీసులు అడ్డుకున్నారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సునీల్ రెడ్డిని హౌస్ అరెస్టు చేశారు. భారత రాష్ట్ర సమితి నాయకులను సైతం గృహ నిర్బంధం చేశారు. గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్న కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. భారత రాష్ట్ర సమితి నాయకులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఇంటి ముందే ఆపివేశారు. ఈక్రమంలో పోలీసులు, కార్యకర్తలకు మధ్య తోపులాట చోటు చేసుకుంది.

# కేంద్రమంత్రి బండి సంజయ్‌కి సిట్ నుంచి పిలుపు

హైదరాబాద్: కేంద్రమంత్రి బండి సంజయ్‌కి సిట్ నుంచి పిలుపు వచ్చింది. ఈ నెల 24న ఫోన్ ట్యాపింగ్ కేసులో వాంగ్మూలం ఇవ్వాలని సమాచారమిచ్చింది. తన స్టేట్‌మెంట్ కోసం లేక్ వ్యూ అతిథి గృహానికి రావాలని బండి సంజయ్ అధికారులకు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో వివిధ పార్టీల ప్రజాప్రతినిధుల ఫోన్లు ట్యాపింగ్ జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంలో పలువురు నేతలను పిలిచి సిట్ వాంగ్మూలం తీసుకుంటోంది



# 80 వేల ఫొటోలు, వీడియోలతో సన్యాసులను బెదిరించి.. రూ.100కోట్లు కొల్లగొట్టి..!

ఓ యువతి విసిరిన వలపువలలో తొమ్మిది మంది సన్యాసులు చిక్కుకున్నారు. వీడియోలు, ఫొటోలు చూపించి ఆమె చేసిన బెదిరింపులకు వణికిపోయిన వారు గత మూడు సంవత్సరాలుగా రూ. 102 కోట్లు సమర్పించుకున్నారు. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. థాయ్‌లాండ్‌లో వెలుగుచూసిన ఈ వలపువల వ్యవహారం సంచలనంగా మారింది. తొమ్మిది మంది సన్యాసులను ప్రలోభపెట్టిన ఆ మహిళకు పోలీసులు మిస్ గోల్ఫ్‌గా పేరుపెట్టారు. జూన్‌నెలలో బాధితుల్లో ఒకరు సన్యాసానికి దూరం కావడం, దానిపై పోలీసులు దృష్టి సారించడంతో ఆమె బండారం బయటపడింది. 2024 మేలో మిస్ గోల్ఫ్ ఒక సన్యాసితో సంబంధాన్ని ఏర్పరచుకుంది. ఆ బంధం వల్ల ఒక బిడ్డ జన్మించిందని చెప్పింది. ఖర్చుల కోసం 7 మిలియన్ బాట్ (రూ. 1.85కోట్లు) ఇవ్వాలని డిమాండ్ చేసింది. అతడిని మభ్యపెట్టినట్టే మరికొంతమంది సన్యాసులతో ఇలాగే వ్యవహరించిందని దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. 80వేల ఫొటోలు, వీడియోలతో ఈ కథంతా నడిపిందని వెల్లడించారు. వారి నుంచి కొల్లగొట్టిన డబ్బునంతా డ్రా చేసుకొని, కొంతమొత్తాన్ని జూదానికి ఉపయోగించిందని చెప్పారు. దోపిడీ, మనీలాండరింగ్ వంటి ఆరోపణలపై ప్రస్తుతం పలు కేసుల్ని ఎదుర్కొంటోంది. ఈ ఘటన దెబ్బతో ఇలాంటి కేసులు ఇంకా ఏమైనా ఉన్నాయా..? అని గుర్తించేందుకు థాయ్ అధికారులు ఒక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారు.



Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com